
9440662699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015




# రాజధాని వార్తలు

Voice of Voiceless

ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక

అమరావతి సంపుటి : 3 సంచిక 1, పేజీలు 4 రూ. 2/- సెప్టెంబర్, సోమవారం 25- అక్టోబర్, ఆదివారం 1-2017











దసరా నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించిన విజయవాడలోని కనకదుర్గా ఆలయం

## ఇస్లాం నూతన సంవత్సరం : మొహర్రం



మొహర్రం మాసం ఆరంభం రోజున ఇస్లామ్ నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఇది అరబ్బీ కేలండర్ మొదటి నెల. పూర్వకాలంలో అరబ్బులు(అరేబియాలోని యూదులు, క్రైస్తవులతో సహా) ఈ కేలండర్‌నే ఉపయోగించేవారు. ఆషూరా దినం, అనగా మొహర్రం ఒకటవతేదీని, అనేక సాంప్రదాయక గుర్తులకు అనుగుణంగా పండుగగా జరుపుకునేవారు. పద్నాలుగు శతాబ్దాల క్రితమే ప్రజాస్వామ్యం కోసం, మానవ హక్కుల కోసం జరిగిన చరిత్రాత్మక పోరాటం 'మొహర్రం' ఈ పేరు వినగానే పీర్లు, నిప్పులగుండాలు, గుండెలు బాదుకుంటూ 'మాతిం' చదవటాలు గుర్తుకొస్తాయి. మొహర్రం జరిగే పది రోజులు విషాద దినాలే కాని, ఎంత మాత్రం సంతోష దినాలు కాదు.

క్రీ.శ 632 మహమ్మద్ ప్రవక్త (స)పరమపదించారు. ప్రజలు ప్రజాస్వామ్య రీతిలో తమ ప్రతినిధుల్ని ఖలీఫాలను ఎన్నుకోవాలి. హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్, హజ్రత్ ఉమర్, హజ్రత్ ఉస్మాన్, హజ్రత్ అలీ ఈ విధంగా ఎన్నికైన ఖలీఫాలే. ఇమామ్ హసన్, ఇమామ్ హుస్సేన్- ఇరువురు దైవ ప్రవక్త మహమ్మద్(స) మనవలు. హజ్రత్ అలీ తనయులు. హజ్రత్ అలీ తరువాత ప్రజలు ఇమామ్ హసన్‌ను ప్రతినిధిగా ఎన్నుకొన్నారు. అప్పుడు సిరియా ప్రాంత గవర్నర్ మావియాలో అధికార దాహం పెరిగింది. కత్తితో రాజ్యాన్ని హస్తగతం చేసుకోవాలని కుట్ర పన్నాడు. యుద్ధం ప్రకటించి ఇమామ్ హసన్‌ను గద్దెదించాలనుకొన్నాడు. యుద్ధంలో పాల్గొంటే అమాయక సోదర ప్రజలు ప్రాణాలు కోల్పోతారనే బాధాతప్త హృదయంతో యుద్ధనివారణ కోసం ఇమామ్ హసన్ ప్రజలు తనకు కట్టబెట్టిన పదవిని త్యజించారు. మావియా కుట్ర ఫలించింది. అయితే కొద్ది రోజుల వ్యవధిలోనే హసన్ విషప్రయోగానికి గురై హతులయ్యారు. నిరంకుశంగా మావియా తన కుమారుడు యజీద్‌ను రాజ్యాధికారిగా నియమించారు. ఇస్లామీయా ధర్మశాస్త్రాన్ననుసరించి సంప్రతింపులే సమస్యల విమోచనకు మార్గాలు. చర్చలకోసం ఇమామ్ హుస్సేన్ రాజధాని కుఫాకు బయల్దేరారు. యజీద్‌కు విజయం తెలిసింది. పాషాణ హృదయుడైన అతడు ఇమామ్ హుస్సేన్‌ను మార్గం మధ్యలో అడ్డుకొని లొంగదీసుకోవడానికి సైన్యాన్ని పంపాడు. ఇమామ్ పరివారాన్ని కర్బలా అనే చోట అడ్డగించి యజీద్‌ను రాజుగా అంగీకరించమని సైన్యాధిపతి హెచ్చరించాడు లేదా యుద్ధానికి సిద్ధపడమన్నాడు. మిత్రులు, కుటుంబసభ్యులు, స్త్రీలు,పిల్లలు కలసి మొత్తం 72 మంది ఇమామ్ హుస్సేన్ వెంట ఉన్నారు. పది రోజులు యుద్ధం జరిగింది. ఇమామ్ హుస్సేన్ పరివారం స్వల్పమైనా వీరోచితంగా పోరాడి అశువులు బాసింది. పదోరోజు హుస్సేన్ ఒక్కరే మిగిలారు. శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ కోసం శత్రువునడిగి కొన్ని నిమిషాలు అనుమతి పొందారు. ప్రార్థనలో నిమగ్నమైన తర్వాత శత్రువులు భీరులై ఇమామ్ హుస్సేన్‌ను వెన్నుపోటు పొడిచి సంహరించారు. దీంతో మొహర్రం పది రోజులు విషాద దినాలుగా మారాయి. తెలుగు ప్రాతాంల్లో మరీ ముఖ్యంగా నిజాం పాలిత ప్రాంతాల్లో మొహర్రం పండుగను ముస్లిములే కాక అన్ని వర్గాల ప్రజలూ జరుపుకోవడం వందలాది ఏళ్ళుగా సాగుతోంది. యాత్రాచరిత్రకారుడు ఏనుగుల వీరాస్వామయ్య జూన్ 29, 1830న నిజాం పాలిత ప్రాంతాల్లో ప్రారంభమైన మొహర్రం పండుగను తాను రచించిన కాశీయాత్ర చరిత్రలో అభివర్ణించారు. ఆయన హైదరాబాద్ ప్రాంతంలో జరిగిన మొహర్రం పండుగ వైభవాన్ని ఇలా వర్ణించారు: షహరు (హైదరాబాదు)కు కంచికి గరుడసేవ ముఖ్యమైనట్టుగా ఆ మొహర్రం పండుగ ప్రబలమైన ఉత్సవము. ఆ ఉత్సవ కాలములో పరమాత్మని చైతన్యము ఆ షహరులో ఎక్కువగా ప్రకాశించుటచేత అనేక వేలమంది. ఇతర మతస్థులుగా నుండేవారు కూడా షహరుకువచ్చి ఆ తొమ్మిదో దినము మొదటి నుంచి ఆఖరువరకు నుంచున్నారని ఆయన రాశారు.

– ఖాన్

## ఎంత తేడా.. మేం కళ్లు మూసుకోలేం



**న్యూఢిల్లీ :** రెండవసారి నిర్వహించిన వేలంలో సదావర్తి సత్రం భూముల ధర మూడింతలు పెరగడంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, న్యాయ మూర్తులు జస్టిస్ ఎ.ఎం.ఖన్విల్కర్,జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ భూములను తొలిసారి వేలం వేసినప్పుడు తాము వేలం పాడి దక్కించుకున్నామని, తమకే అప్పగిం చాలని ఎం.సంజీవరెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించగా ప్రధాన న్యాయమూర్తి నేత ృత్వంలోని ధర్మాసనం ఈనెల 12న ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ కళ్లు కప్పొద్దని, వేలం తిరిగి నిర్వహించాల్సిం దేనని ఆదేశిస్తూ కేసును 22వ తేదీకి వాయిదా వేసింది. తాజాగా శుక్రవారం ఈ కేసు విచారణకు రాగా.. వాది, ప్రతివాది ఇద్దరూ వేలంలో పాల్గొన్నారా? వేలంలో ధర ఎంత పలికింది? అని న్యాయమూర్తులు ప్రశ్నించారు. దీనికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫు న్యాయవాది గుంటూరు ప్రభాకర్ స్పందిస్తూ వేలం వివరాలను ధర్మాసనానికి వివరించారు. వాది, ప్రతివాది ఇద్దరూ వేలంలో పాల్గొన్నారని, అత్యధికంగా రూ.60.30 కోట్ల ధర పలికిందని వివరించారు. దీంతో ధర్మాసనంలోని ముగ్గురు న్యాయమూర్తులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'చూడండి ఎంత తేడా ఉందో.. దయచేసి మీరు మొదటి వేలానికి, రెండో వేలానికి వ్యత్యాసం చూడండి. రూ.22 కోట్లు ఎక్కడ? రూ.60 కోట్లు ఎక్కడ? దాదాపు రూ.40 కోట్లు. అంటే మూడింతలు. ప్రజల ఆస్తులను, ట్రస్టు ఆస్తులను ఇలా తక్కువ ధరకు అమ్మేయడం సరికాదు. ఇలా జరిగితే మేం కళ్లు మూసుకోలేం..' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మొదటి బిడ్డర్ సత్యనారాయణ బిల్డర్స్ నిర్ణీత గడువులోగా నిర్దిష్ట మొత్తాన్ని చెల్లించలేదని, దీంతో రెండో బిడ్డర్ చదలవాడ లక్ష్మణ్ (రూ.60.25 కోట్లు)కు శనివారం వరకు డబ్బు చెల్లించేం దుకు అవకాశం ఉందని గుంటూరు ప్రభాకర్ వివరించారు. ఇదే సందర్భంలో తమిళనాడు ప్రభుత్వం తరఫు న్యాయవాది తాము ఈ కేసులో మధ్యంతర దరఖాస్తు సమర్పించామని, ఈ భూములు తమ రాష్ట్రంలో ఉన్నాయని చెప్పారు. అందువల్ల వీటిపై హక్కులు తమకే చెందుతాయని ధర్మాసనానికి విన్నవించగా.. జస్టిస్ దీపక్ మిశ్రా ఈ విన్నపాన్ని తోసిపుచ్చారు. "ఏంటి ఇది? మేం ఈ కేసు విచారిస్తున్నది భూముల టైటిల్ ఎవరిదో నిర్ణయించడానికి కాదు.." అని చెబుతూ ఆ దరఖాస్తును విచారించేం దుకు నిరాకరించారు. పిటిషనర్ సంజీవరెడ్డి తరఫు న్యాయవాది రామకృష్ణ ప్రసాద్ స్పందిస్తూ.. ఈ వేలంపై తమకు కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని, వాటికి సంబం ధించిన డాక్యుమెంట్ల సమర్పణకు కొంత గడువు ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో విచారణను ధర్మాసనం అక్టోబర్ 6వ తేదీకి వాయిదా వేసింది. విచారణకు ప్రతివాది ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఆయన తరఫు న్యాయవాదులు సుధాకర్‌రెడ్డి, అల్లంకి రమేశ్ హాజరయ్యారు.

### వేలం వేసిన భూముల విలువ రూ.1,300 కోట్లు

సదావర్తి భూముల అమ్మకాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల అధికారులు, అనధికారుల అవినీతి వ్యవహారంపై సీబీఐతో దర్యాప్తు జరిపించేలా ఆదేశాలు ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఎం.సంజీవరెడ్డి వర్సెస్ ఆళ్ల రామకృష్ణారెడ్డి కేసులో తనను ఇంప్లీడ్ అయ్యేందుకు అనుమతించాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం ఆయన తరఫున న్యాయవాది కె.శ్రవణ్‌కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. సదావర్తి సత్రం లక్ష్యం, ఉద్దేశాన్ని కాపాడేందుకు ఆ భూములను పరిరక్షించాలని, లేదా ట్రస్టుకు ప్రత్యామ్నాయ భూములు కేటాయించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. సదావర్తి భూములు మొత్తం రూ.5 వేల కోట్ల విలువైనవని వివరించారు. ఆక్రమించుకున్నవి, అన్యాక్రాంతమైనవి, తమిళనాడు ప్రభుత్వం కేటాయించినవి పోగా ఇప్పుడు వేలం వేసిన 83.11 ఎకరాల భూముల విలువ దాదాపు రూ.1,300 కోట్లు అని పేర్కొన్నారు.


ఈ భూములను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుయుక్తులతో కేవలం రూ.22 కోట్లకే అధికార పార్టీకి చెందిన వారికి కట్టబెట్టేందుకు వేలాన్ని ఎంపిక చేసిన బృందానికి పరిమితం చేసిందన్నారు. కోర్టు ఆదేశించిన నేపథ్యంలో రెండోసారి వేలం నిర్వహిస్తే తనకు సంబంధం లేకపోయినా మంత్రి ఆదినారాయణరెడ్డి వేలాన్ని నియంత్రించారని, ఈ వేలంలో పాల్గొంటే ఐటీ దాడులు తప్పవని ముఖ్యమంత్రి కుమారుడు, మంత్రి లోకేశ్ పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారని ఆరోపించారు.






## ధరలేక టమోట దిగాలు

- పంట చేతికి రాగానే పడిపోయిన ధరలు
- రైతుల ఆందోళన




**కర్నూలు :** రైతులకు పంటపండినా పండకపోయినా వేధనమాత్రం తప్పడంలేదు. పంటచేతికి వచ్చేవరకు వాతావరణం ఎలా ఉంటుందోఅని నానాబాధ పడితే, వచ్చిన తర్వాత మార్కెట్‌లో ధర ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత పదిరోజుల వరకు మార్కెట్‌లో టమాటా కిలో 50 నుంచి 60 రూపాయలతో అమ్మకాలు జరిగాయి. ఏడాది వర్షాలు ఆలస్యంగా రావడంతో టామాటా దిగుబడులు కొద్దిగా ఆలస్యమయ్యాయి. జిల్లాలో టమాటా పంటను పత్తికొండ, దేవరకొండ, ఆస్పరి, ప్యాపిలి, డోన్ ప్రాంతాలలో ఎక్కువగా సాగు చేస్తారు. పంట సాగు చేసేందుకు నారుకు రూ.6 వేలు, క్రిమిసంహారక, ఎరువుల మందులకు రూ.18 వేలు, కూలీలకు రూ.6 వేలు మొత్తం 30 వేల రూపాయల వరకు ఖర్చు అవుతుంది. పంట దిగుబడి బాగా వస్తే ఎకరాకు పంట ఒక్కో కోతకు 40 గంపల టమాటాలు వస్తాయి. మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉంటే పెట్టుబడులు పోనూ ఎకరాకు రూ.25 వేల నుండి 30 వేల రూపాయలు రైతుకు ఆదాయం వస్తుంది. ప్రస్తుతం రైతు వద్ద పంట చేతికి రాగానే ధరలు ఒక్కసారిగా పడి పోయాయి. 20 కిలోలు ఉన్న గంప

- మిగతా 3లో













# రాజధాని వార్తలు

కలం

## మేడిపండు విద్యాసంస్థలు


సీనియర్ ఐఏఎస్‌లు వర్ధమాన అధికారులకు అవగాహన కల్పిస్తారు..
కేన్సర్ బారిన పడి కోలుకున్నవాళ్లు తోటి బాధితులకోసం
కార్యక్రమాలు నిర్వహిస్తారు
మాదక ద్రవ్యాల నుంచి బయటపడినవారు
మిగతావారిని బయటపడేట్లు చేస్తారు.

అయితే విద్యార్థులను బలితీసుకుంటున్న కార్పొరేట్ కళాశాలలపై ఎవరూ ఎందుకు అవగాహన కల్పించలేకపోతున్నారనేది అర్థంకాని విషయం. ఇప్పటివరకు ఎంతమందో తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులను చేయాలని వారిని అకాల మృత్యు గృహాలకు తరలించి, ఆపై జీవితాంతం తల్లడిల్లుతున్నారే తప్ప ఇలాంటి వేదన మరొకరికి రాకూడదనే ఉద్ధేశ్యంతో ఎందుకు సమాజంలో స్పృహ కలిగించడంలేదని అంతుచిక్కని ప్రశ్నగా మిగిలిపోయింది.

పదవతరగతి పరీక్షాఫలితాలు రాగానే ఆయా కార్పొరేట్ కళాశాల్లోని గుంటనక్కలన్నీ తియ్యటి కబుర్లు చెబుతూ కాలేజీల్లో అడ్మిషన్లు తీసుకునేవరకు తిరుగుతారు. విద్యార్థిగా ఆ సంస్థలో చేరగానే పరిస్థితులు తారుమారవుతాయి. వాడిపై కక్ష సాధించడమే పనిగా పెట్టుకుంటారు. ఇక హాస్టళ్లలో ఉండే విద్యార్థుల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. బోధనపై అవగాహనలేని ఉపాధ్యాయులు, చదువుపై జిజ్ఞాస కలిగించలేని మందమతులు వారిని కొట్టి, మానసికంగా దెబ్బతీసి అదేదో గొప్ప ఘనకార్యంగా భావించడం సర్వత్రా జరుగుతోంది. ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో తెలియని స్థితిలో, అసహాయతలో తల్లిదండ్రులు ఉంటున్నారు. ప్రభుత్వంలో వారే తిరుగులేని శక్తిగా మారడంతో రాష్ట్రంలోని విద్యాప్రమాణాలు పూర్తిగా దిగజారిపోయాయి. ఇంటర్మీడియట్‌లో చేరాలంటే కార్పొరేట్ స్కూళ్లదే రాజ్యం.లక్షలాదిమంది విద్యార్థులను చేర్చుకుంటున్న ఈ రెండు విద్యాసంస్థలు తల్లిదండ్రుల కష్టార్జితంతో పాటు వారిబిడ్డలను కూడా బలితీసుకుంటున్నాయి. రెండున్నర దశాబ్ధాలుగా ఈ విద్యా వ్యాపార సంస్థల్లో ఎంతమంది చనిపోయారో లెక్కేలేదు. ఇదేపరిస్థితి మిగతా దేశాల్లో తలెత్తితే నిర్థాక్షిణ్యంగా వందల ఏళ్లు జైలుశిక్షలు విధించేవారు. ఈ సంస్థలపై తల్లిదండ్రులు / కోర్టు /మానవ హక్కుల కమిషన్‌లు ఎందుకు సుమోటోగా తీసుకొని విచారణ జరిపడంలేదో తెలీదు. ఇదే సమయంలో క్రమబద్ధీకరణపేరుతో ప్రభుత్వం ఇప్పటి వరకు 4వేల స్కూళ్లు చేయగా కొత్తగా మరో 8వేల పాఠశాలలకు ఎసరు పెట్టింది. దీంతో ఎల్‌కేజీ నుంచి అత్యున్నతస్థాయి విద్యవరకు ప్రైవేటు పరం అయిపోయాయి. దేశ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకున్న ఏ ప్రభుత్వం విద్యావైద్యం ప్రజామౌలికవసతులపై ఇంత నిర్థాక్షిణ్యంగా ప్రవర్తించదు. దీంతో తమ పిల్లలను తమ చేతులతోనే తల్లిదండ్రులు కసాయిలకు అప్పగించడం నిత్యకృత్యం అయిపోయింది. ఏదైనా ఘటన జరిగినప్పుడు విపక్షాలు ఆందోళన చేపట్టడం, నాలుగురోజుల్లో మామూలవడం సర్వసాధారణం అయిపోయింది. పిల్లల కర్ణభేరి పగిలేంతగా, వారి ఒంటిపై కర్రలు విరిగేంతగా, వారి సున్నిత మనస్సులు ముక్కలై, ఆత్మహత్యలు చేసుకునేలా ప్రవర్తించే యాజమాన్య సిబ్బందిపై ప్రజలు కళ్లెర్ర చేసే పరిస్థితి ఇంకెంతదూరంలోనే లేదు.

రాజధాని డిజైనులు సెలెక్టు చేయడానికి దర్శకుడు రాజమౌళిని లండన్ పంపారని అంటున్నారు.

రేపెప్పుడైనా చైనాతోనో పాకిస్థాన్ తోనో యుద్ధమొస్తే హీరో ప్రభాస్ ని పంపిస్తారా ఏంటి కొంపదీసి?



## రాయపూడిలో కుమార్‌స్వామి వేడుకలు

**రా.వా.ప్రతినిది- రాయపూడి :** రాయపూడి ఎన్‌సీసీ కంపెనిలో పనిచేసే పశ్చిమ బెంగల్ వర్కర్లుప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాదికూడా కుమార్‌స్వామి పూజాకార్యక్రమం జరిపారు. కాంట్రాక్ట్ ఈవీ రావు అధ్యర్వంలో పూజ ఘనంగా నిర్వహించారని సూపర్‌వైజర్ రాము రాజధాని ప్రతినిధికి తెలిపారు.



## మన కోసం

| | | | | |
|---|---|---|---|---|
| | శ్రీ విజయలక్ష్మీ జనరల్ స్టోర్స్ | తుళ్ళూరు | చందోలు సత్యనారాయణ | 9441411432 |
| రెస్టారెంట్స్ | బిర్యానిస్ | విజయవాడ | బిర్యానిస్ | 7032202222 |
| | స్వాగత్ మెస్(వెజ్) | మల్కాపురం | చిగురుపాటి | 90329 58580 |
| | ఎస్.ఆర్.కె. గ్రాండ్ | మందడం | శ్రీనివాస్ | 9553023388 |
| షాప్స్ | రేమాండ్స్‌టైలర్స్ | తుళ్ళూరు | ఎస్.కె. జాని | 9492470426 |
| | వర్షిత ఫోటోస్టాట్ | రాయపూడి | పోతురాజు | 9985853188 |
| | బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్ | రాయపూడి | షేక్. మజీదు | 7095880828 |
| | కె.జి .ఎన్. కారు ట్రావెల్స్ | రాయపూడి | ఎస్.కె.సుబాని | 97040 74820, |
| | వైభవ్ డ్రస్సెస్ | తుళ్ళూరు | ఎస్‌వి. పున్నారావు | 9848407935 |
| | చైతన్య గోదావరి బ్యాంకు | రాయపూడి | | 08645244266 |
| | ఉంగరాల హుస్సేన్ టెంట్‌హౌస్ | రాయపూడి | ఉంగరాలఖాజ | 9441275466 |
| | అంజుమన్ టెంట్ హౌస్ | రాయపూడి | పఠాన్ బాషా ఖాన్ | 9502085516 |
| ట్రేడర్స్ | సాయి గణేష్ | వెలగపూడి | జొన్నలగడ్డ మనోజ్ కుమార్ | 7382371111 |
| | శ్రీ చంద్రిక | రాయపూడి | కోలా శ్రీనివాసరావు | 908073516 |

### మ్యారేజీ లింగ్స్

| | | |
|---|---|---|
| షేక్ జానీ | విజయవాడ | 9948450761 |


# ఆస్తిహక్కు రద్దు..



### పౌరులు-చట్టాలు




కాటూరు రవీంధ్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది
98495 68901


27 రాజ్యాంగంలోని అధికరణం 19(1)-ఆస్థి హక్కుకి సంబంధించింది. ఉదారభావనతో ఈ హక్కును కల్పించినా,ఆచరణలో దుర్వినియోగం అవడం, అనేక న్యాయపరమైన చిక్కులు తలెత్తడంతో 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈహక్కును తొలగించటం జరిగింది. ఆస్తిహక్కుకి సంబంధించిన 31వ అధికరణాన్ని కూడా 44వ సవరణ ద్వారా తొలగించారు. ఈ అధికరణం పౌరులైనా కాకపోయినా, ప్రతివ్యక్తికీ ఆస్థిహక్కు కల్పించింది.

అయితే 13వ అధికరణంతో నిమిత్తం లేకుండా రాజ్యాంగ 4వ అధ్యాయంలో 12వ భాగంలో 300-ఎ అధికరణం నిర్ధ్వందంగా, చట్టం ద్వారా తప్ప,ఇతరత్రా ఆస్థిని పోగొట్టుకునే అవకాశం లేదని ప్రకటించింది. అంటే- చట్టంద్వారానే ఆస్థిరక్షించుకోవచ్చు తప్పహక్కు గా కాదు కాబట్టి, ప్రాథమిక (fundamental) హక్కుల్లో ఆస్థిహక్కు లేదు.

**కొన్నిచట్టాలకు మినహాయింపులు**

13వ అధికరణంలో చెప్పిన దాంతో సంబంధం లేకుండా,క్రింద చెప్పబడే విషయాలకు 14,19 అధికరణల ద్వారా లభించిన ప్రాథమిక హక్కులకు భంగంగా ప్రకటించరాదు.

- ప్రభుత్వం ఏదైనా ఆస్థులు,హక్కులు సవరించటం రద్దు చెయ్యడం ద్వారా వాటిని స్వాధీనం చేసుకోవచ్చు.
- ప్రభుత్వం ఏదైనా సంస్థ ఆస్థులు తాత్కాలికంగా నిర్వహణ నిమిత్తం స్వాధీనం చేసుకోవచ్చు. తద్వారా ప్రజల అభీష్టం మేరకు సవ్యంగా నిర్వహించవచ్చు.
- రెండు లేక అంతకన్న ఎక్కువ కార్పొరేషన్లను ఏకం చెయ్యవచ్చు తద్వారా కార్పొరేషన్లను సమర్థవంతంగా నిర్వహించవచ్చును.
- ఏదైనా కంపెనీ మేనేజింగ్ డైరెక్టరు,డైరెక్టర్లు లేక మేనేజర్ల లేక సదరు కార్పొరేషన్ షేర్‌హోల్డర్ల హక్కులను సవరించటం,రద్దు చెయ్యడం వంటివి
- ఎదైనా అగ్రిమెంట్ లీజ్-లేక లైసెన్సు -శోధనకి సంబంధించింది,లేక ఖనిజాలు, ఖనిజ సంబంధ చమురుశోధన వప్పందం సవరించుట లేక ముందస్తుగా రద్దు చేయుట.

ఇక్కడ అధికరణం 31-ఎ (1) కీలకమైనది.

ఒక రాష్ట్ర చట్టసభ ఏదైనా చట్టం చేసినప్పుడు రాష్ట్రపతి ఆమోదం కోసం నిరీక్షణలో ఉంచడం ఆమోదం లభించడం వంటివి జరిగినప్పుడే అధికరణం 31-ఎ వర్తిస్తుంది.

**రాష్ట్ర ప్రభుత్వం ఆస్థిస్వాధీనానికి చట్టంచేసినప్పుడు**

- సదరు భూమి ఒక వ్యక్తి అధీనంలో ఉండి, అతని చేత సాగు చెయ్యబడుతున్నప్పుడు, ఆ భూమి సీలింగు పరిమితిలోనే ఉండగా, దానిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవటం న్యాయ సమ్మతం కాదు.
- సదరు భూమిలో గల నిర్మాణాలను స్వాధీన పరచుకోదలిస్తే, అందునిమిత్తం చేయబడిన చట్టంలో, సంబంధిత యజమానికి మార్కెట్ విలువకు తగ్గకుండా నష్టపరిహారం చెల్లించేందుకు తగిన ఏర్పాటు ఉండాలి. భూసేకరణ, వ్యక్తుల ఆస్తిపాస్తులకు,జీవికకు నష్టం వాటిల్లకుండా చూడాలనేది ఇందులో ప్రధానాంశం.

(సశేషం)

## జనవాహిని పార్టీ పతాకావిష్కరణ

**విజయవాడ :** ప్రాథమిక హక్కులైన విద్య,వైద్యం ఉచితంగా అందిస్తామని విచ్చలవిడి వ్యాపారాన్ని నిషేధిస్తామని జనవాహిని పార్టీ అధ్యక్షుడు డీఎస్ఎన్‌వీ ప్రసాదుబాబు తెలిపారు. విజయవాడ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో శనివారం ఉదయం 10 గంటలకు జనవాహిని జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పై విధంగా వెల్లడించారు. మహిళలకు అధికార, అనధికార పదవులలో 50 శాతం కేటాయించి సామాజిక న్యాయం అమలు చేస్తామన్నారు. ఎన్నికల సంస్కరణలు అమలు చేసి సామాన్యులు రాజకీయాలలోకి వచ్చే విధంగా కృషిచేయడమే తమ పార్టీ లక్ష్యమన్నారు.సమాజంలో పాతుకుపోయిన అవినీతిని అంతం చేయచేసే దిశలో పనిచేస్తున్నామని ప్రసాదుబాబు తెలిపారు. ఈ సమావేశానికి నాయకులు, అశేషప్రజావాహిని హాజరై సభను జయప్రదం చేశారు.





## రాయపూడిలో ఉచిత వైద్య శిబిరం

**రా.వాప్రతినిధి. తుళ్ళూరు:** మండల పరిధిలోని ఆర్.సి.ఎం చర్చి ఆవరణలో తుళ్ళూరు విచారణ గురువులు, మేరిమాత కాన్వెంటు సిస్టర్ జైన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతి ఏడాదిలాగే ఇటలి నుంచి వచ్చిన డాక్టర్ల బృందం వారు తుళ్ళూరు మండల పరిసర గ్రామాల్లో దొండపాడు, నేలపాడు, అబ్బురాజుపాలెం, రాయపూడి గ్రామాల్లో గత నాలుగు రోజుల నుంచి ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. వైద్యులు, రోగులను పరీక్షించి ఉచిత మందులు పంపిణీ చేయుట జరిగిందని తుళ్లూరు విచారణ గురువులు, ఫాదర్ వట్టి ఇన్నయ్య రెడ్డి , మేరిమాత కాన్వెంట్ సిస్టర్ జెయిని తెలిపారు. మేరిమాత కాన్వెంట్ సిస్టర్ జైన్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపస్ ఏర్పాటు చేశారు.


## ఎలా బయటికొస్తున్నాయ్ ?

### రహస్య కార్యాచరణకు సీఎస్ ఆదేశం

**రా.వా ప్రతినిధి,అమరావతి :** సచివాలయంలో జరుగుతున్నవన్నీ 24 గంటల్లో ఎలా బయటికి పొక్కుతున్నాయ్ అనే విషయం ముఖ్యమంత్రితో సహా మిగతా మంత్రివర్గాన్ని ఇతర ఉన్నతాధికారులను కలవర పెడుతోంది. ముఖ్యమంత్రి కార్యాలయంలో పని చేసే వారిలోనే కోవర్టులు ఉన్నారా.. ఉంటే వారు సిబ్బందా.. లేక అధికారులా, ఉన్నతాధికారులా అనే అంశంపై ఇప్పుడు వెలగపూడి సచివాలయంలో ప్రస్తుతం వాడీవేడి చర్చ జరుగుతుంది.

రాష్ట్ర మంత్రి వర్గం సమావేశం జరిగిన తరువాత కేవలం 24 గంటలలోనే కేబినెట్ నోట్‌కు సంబంధించిన కాపీలు, ముఖ్యమంత్రి చంద్రబాబు అంతర్జాతీయ స్థాయిలో పారిశ్రామిక వేత్తలతో చేసుకున్న ఒప్పంద పత్రాలు.. ఇలా ఒకటి కాదు...మరెన్నో కీలక ఫైళ్లు ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చేరుతున్నాయని విశ్వసనీయ సమాచారం. దీంతో ప్రభుత్వం చేసే పనిలో ఆయా కోవర్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని, ఇలా చేయడానికి ప్రధాన కారణమూ ఉందని తెలుస్తోంది. గతంలో సీఎం తన కార్యాలయంలో పని చేసే సిబ్బంది, అధికారులు, ఉన్నతాధికారుల నియమకాల్లో శ్రద్ధ పెట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని సమాచారం. ఫైళ్లను, ఒప్పందం పత్రాలను చివరికి కేబినెట్ నోట్ ఫైల్‌ను కూడా ప్రతిపక్ష నేతతోపాటు మరో ఉద్యమ నేతకు చేరవేస్తున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆగస్టు నెల మొదటి వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల సమావేశానికి 75 శాతం మంది ఉన్నతాధికారులు చాలా ఆలస్యంగా రావటంతో ఆగ్రహించిన సీఎం రాష్ట్ర విభజన తరువాత పదవీ విరమణ వయస్సు 58 నుండి 60కి పెంచి ఏమైనా పొరపాటు చేసానా, ఉద్యోగుల పని తీరు చూస్తుంటే వారి పదవీ విమరణ వయస్సును తిరిగి 50 ఏళ్లకు కుదిస్తే మంచిదేమో ఆలోచించండి అంటూ ఆ సమావేశంలో వ్యాఖ్యలు చేశారు. వాటి ఆధారంగా సీనియర్ అధికారుల ఆగమేఘాల మీద ఫైల్ సిద్ధం చేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ అభిప్రాయానికి పంపించడంతో సచివాలయ ఉద్యోగులలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో ముఖ్యమంత్రి ఆ ఫైల్‌ను పెండింగ్‌లో పెట్టమన్నారు. ఎలాంటి ఆదేశాలు లేకుండానే కొంతమంది ఉన్నతాధికారులు ఫైళ్లను సిద్ధం చేయడంతోపాటు వాటిని ప్రతిపక్ష నేతలకు దొడ్డిదారిన చేరవేయడంతో ప్రభుత్వ పని తీరు ఇరకాటంలో పడుతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ విషయాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్‌కు ఒకింత అనుమానం కలగటంతో తక్షణమే కోవర్టులపై రహస్య విచారణకు ఆదేశించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి అత్యంత రహస్యంగా జరిపే విషయాలు ఎలా చేరుతున్నాయో అర్థంకాని అయోమయ స్థితిలో ముఖ్యమంత్రి కార్యాలయం ఉన్నతాధికారులు తలలు పట్టుకొంటున్నారు. ఈ విషయాన్ని ఎవరు బయటపెట్టినా అది వారికే చుట్టుకొంటుందన్న భయంతో కొంతమంది ఉన్నతాధికారులు నోరు మెదపడంలేదని తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికి ప్రభుత్వం ఇప్పటికైనా తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి కార్యాలయంలో పని చేసే ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. దీనిపై సీఎం చంద్రబాబు ఎటువంటి చర్యలు తీసుకొంటారో వేచి చూడాల్సి ఉంది.

# ఇకపై పిల్లలకు పౌష్టికాహారం కరువే..!



**రా.వా ప్రతినిధి, విజయవాడ :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు 44,528, మధ్యాహ్న భోజనం చేస్తున్న పిల్లలు 34.57 లక్షలు మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీల్లో పనిచేస్తున్న మహిళలు 89,000స్థానికంగా లభించే కూరగాయాలు, ఆకుకూరలతో పాఠశాలల్లోనే వంట చేయాలి. తాజాగా వండిన వేడివేడి ఆహారపదార్థాలను మాత్రమే విద్యార్థులకు వడ్డించాలి. చల్లటి. చద్ది పదార్థాలు పెట్టకూడదు. పాఠశాలల్లో వంట చేయడం వల్ల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ ఉంటుంది. ఎటువంటి ఇబ్బందులకు అవకాశం ఉండదు.

సుప్రీంకోర్టు కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు బాధ్యతను ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం వల్ల పర్యవేక్షణ కొరవడింది. ఆ సంస్థల వారు ఇష్టానుసారంగా వంట చేస్తున్నారు. ప్యాకెట్లలో ఆహారం సరఫరా చేయడం వల్ల నాణ్యత కూడా ఉండటం లేదు. నిధులు కూడా దుర్వినియోగమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ఒకవైపు మహిళలను ఉద్ధరిస్తామని చెబుతున్న ప్రభుత్వం.. మరోవైపు మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఉపాధి పొందుతున్నవారి నోటికాడి మద్దను కూడా లాగేసేందుకు సిద్ధమైంది. ఇందుకోసం సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తోంది. ప్రొఫెసర్ ఉమాదేవి కమిషన్ సూచనలు తుంగలో తొక్కేస్తోంది. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతలను స్వచ్ఛంద సంస్థల ముసుగులో ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో బాధ్యతలు అప్పగించగా ఆయా సంస్థలు భోజన పథకం నిర్వహణలో విఫలమైనా, పోషకాహారం అందడంలేదని పిల్లల నుంచి ఫిర్యాదులు అందినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎన్ని సమస్యలు వచ్చినా, వేలాది మంది మహిళలు ఉపాధి కోల్పోతారని తెలిపినా కొన్ని సంస్థలకు భోజన పథకం అమలు బాధ్యతలు అప్పగించే విషయంలో మాత్రం వెనుకడుగు వేయడం లేదు. దీంతో ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు మహిళా కార్మికులు సిద్ధమవుతున్నారు.

**మహిళలపై వివక్ష... ప్రైవేటుపై ప్రేమ**

రాష్ట్రంలోని 44,528 మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఎయిడెడ్ స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. ప్రస్తుతం సుమారు 34.54 లక్షల మంది రోజూ మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. రాష్ట్రంలో ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి మహిళా సంఘాలే నిర్వహిస్తున్నారు. ఒక్కో పాఠశాలలో ఇద్దరు మహిళలు వంట చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరుగుతోంది. రోజూ పాఠశాలలో హాజరు తీసిన అనంతరం భోజనం చేసే పిల్లల సంఖ్యకు అనుగుణంగా ప్రధానోపాధ్యాయులు బియ్యం ఇస్తారు. ఏజెన్సీల నిర్వాహకులు మెనూక అనుగుణంగా కూరగాయలు సమకూర్చుకుని వంటచేసి పిల్లలకు పెడుతున్నారు. ఈ తర్వాత రెండు, మూడు నెలలకు ఈ సారి బిల్లులు చెల్లిస్తారు.అయిన అప్పులు చేసి పిల్లలకు అన్నం వండి పెడుతూన్నారు. కనీసం సబ్సీడీపై గ్యాస్‌కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదు. ప్రాథమిక పాఠశాలల్లో వంటపాత్రలు పెట్టుకునేందుకు గదులు కూడా లేవు. ఇటువంటి పరిస్థితుల్లో అష్టకష్టాలు పడుతూనే ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేస్తున్నారు. అయితే, మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఏడాది మే 16వ తేదీన ప్రత్యేక మెమో జారీచేశాయి. దాని ప్రకారం, రెండు, మూడు మండలాల పరిధిలోని 20 వేల నుంచి 25 వేల మంది పిల్లలకు కలిపి ఒకేసారి వంట చేస్తారు. ఇందుకోసం ప్రభుత్వం ఆయా సంస్థలకు సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు రెండు ఎకరాలు చొప్పున స్థలం కూడా కేటాయిస్తుంది. మహిళా సంఘాల సభ్యులు మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న పాఠశాలల్లో వంట గది కూడా కేటాయించని సర్కారు ఇప్పుడు ప్రైవేటు సంస్థలకు సెంట్రలైజ్డ్ కిచెన్ కోసం ఏకంగా రెండు ఎకరాలు స్థలం ఇవ్వాలని నిర్ణయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రూ.1,000 గౌరవవేతనం కూడా సకాలంలో ఇవ్వకుండా మహిళా కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వం ప్రైవేటు సంస్థలపై ఎందుకు అంత ప్రేమను చూపుతోంది. పలువురు ప్రశ్నిస్తున్నారు.

**గుడ్డు పేరుతో కోత... కాంట్రాక్టర్లకు మేత !**

అంగన్‌వాడీ కేంద్రాల తరహాలోనే మధ్యాహ్న భోజన పథకానికి కూడా ప్రభుత్వమే గుడ్లు సరఫరా చేయాలని ఏజెన్సీల నిర్వాహకులు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఈ నెల నుంచి గుడ్ల సరఫరా బాధ్యతను ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించింది. అయితే, ఏజెన్సీలకు కూరల ఖర్చుల కింద ఇస్తున్న మొత్తంలోనే ఒక్కో గుడ్డుకు రూ.2.35 చొప్పున మినహాయిస్తోంది. దీంతో ప్రాథమిక పాఠశాల్లో ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం ఇస్తున్న 6 రూపాయల 13 పైసల్లో గుడ్డు పేరుతో 2 రూపాయల 35 పైసలు కోత విధించి కూరల కోసం కేవలం 3 రూపాయల 78 పైసలు మాత్రమే ఇస్తామని చెప్పినట్లు వంట ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. వాస్తవానికి మూడు రోజులు గుడ్లు సరఫరా చేయాల్సి ఉంది. ఆ మేరకు డబ్బులు కూడా మినహాయించాలి. కానీ, ఆరు రోజులు గుడ్డుకు డబ్బులు కోత విధిస్తున్నారని వంట ఏజెన్సీలు వాపోతున్నాయి. కాంట్రాక్టర్లు పాడైపోయిన, చిన్నగా గుడ్లు సరఫరా చేస్తున్నారని, వాటిని ఉడకబెట్టిన తర్వాత లోపల నల్లగా మారుతోందని, పెచ్చులు ఊడటం లేదని, అందువల్ల పిల్లలు తినడానికి ఆసక్తి చూపడం లేదని తెలిపారు. ఈ విషయంపై మండల స్థాయిలో అధికారులకు అజమాయిషీ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా గుడ్లు సరఫరా చేస్తున్నారు.

**రోడ్డునపడ్డ 90వేల మంది మహిళలు**

**పర్యవేక్షకులు ఎవరు ?**

ఇప్పటివరకు పాఠశాలల్లోనే మహిళలు వంట చేసే వారు. పిల్లలకు వేడివేడిగా వడ్డించేవారు. ప్రైవేటు సంస్థ లకు అప్పగిస్తే సెంట్రలైజ్డ్ కిచెన్‌లో 20వేల నుంచి 25వేల మందికి ఒకేసారి వంట చేస్తారు. అందువల్ల ఉదయమే వంటచేసి ప్యాకెట్ల రూపంలో సిద్ధం చేస్తారు. వ్యాన్లలో ఆ ప్యాకెట్లను పిల్లలకు అందిస్తారు. ఈ క్రమంలో పాకెట్లలో ఉన్న ఆహారపదార్థాలు త్వరగా పాడైపోయే అవకాశం ఉంటుంది. చల్లబడిన పదార్థాలు త్వరగా జీర్ణమయ్యే అవకాశం కూడా ఉండదు. కాబట్టి పిల్లలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంటుందని వైద్య నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఒకవేళ ఆహారపదార్థాలు కలుషితమైనా, సకాలంలో సరఫరా చేయకపోయినా స్థానికంగా పర్యవేక్షించే అధికారం మండలం స్థాయి అధికారులకు లేకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పుడు పాడైపోయిన గుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లను సైతం ఏమీ చేయలేకపోతున్నామని, భవిష్యత్‌లో ఆహారం అందించే సంస్థలు ఇదేవిధంగా వ్యవహరిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ఓ ఎంఈఓ పేర్కొనడం గమనార్హం. మహిళా సంఘాలు అయితే దగ్గరుండి పర్యవేక్షిస్తున్నామని ఆయన చెప్పారు.


**నాలుగేళ్ల కిందటే అభ్యంతరం తెలిపిన ఉమాదేవి కమిషన్**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మెదక్ జిల్లాలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసే బాధ్యత అక్షయపాత్ర సంస్థకు నాటి ప్రభుత్వం ప్రయోగాత్మకంగా అప్పగించింది. దీనిపై అభ్యంతరాలు వ్యక్తంకావడంతో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ కె. ఉమాదేవి నేతృత్వంలో 13మంది నిపుణులతో కమిషన్‌ను నియమించింది. ఈ మేరకు క్షుణ్ణంగా పరిశీలించిన కమిషన్ ప్రతినిధులు, అక్షయపాత్రకు మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతలు అప్పగించడం సరికాదని పేర్కొంటు 2013, జూన్ 24వ తేదీన నివేదిక సమర్పించింది. ఎక్కువ మందికి భోజనం సిద్ధం చేయాల్సి ఉన్నందున అక్షయపాత్ర ఉద్యోగులు తెల్లవారుజాముకి వంట ప్రారంభిస్తున్నారని, ఉదయం 8గంటలకే అంతా సిద్ధంచేసి పాఠశాలలకు పంపిస్తున్నారని, ఇది సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని ఆ నివేదికలో స్పష్టంగా తెలియజేశారు. ఆదే సమయంలో మహిళా నిర్వాహకులు పాఠశాలల్లో హాజరును బట్టి వంట చేస్తారని, అక్షయపాత వారు మాత్రం నెల రోజుల సగటును తీసుకుని భోజనం సిద్ధం చేస్తున్నారని, అందువల్ల ఆహారం, డబ్బులు వృథా అయ్యే అవకాశం ఎక్కువగా ఉందని వివరించారు. అయినా ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం అక్షయపాత, నాంది వంటి సంస్థలకు భోజనం పథకం అప్పగించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# విధినే పరిహాసమాడిన ఆ ఇద్దరూ...

విధి వికృత పరిహాసమాడదామనుకొని ఒక్కోసారి నవ్వులపాలవుతుంది. అరె.. అలా కూడా జరుగుతుందంటున్నారా ? అవును అలానే జరిగింది.. రెండేళ్లక్రితం కాశ్మీర్‌లోని కుప్వారాలో ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కల్నల్ సంతోష్ మహదిక్ (39) తీవ్రగాయాలతో మృతి చెందాడు. ఇద్దరు పిల్లలతో స్వాతి మహదిక్ మిగిలిపోయింది. మరెవరన్నా అయితే కృంగిపోయే వారేమోగాని స్వాతి అలా కాదు. తన భర్త అడుగుజాడల్లోనే నడవాలనుకుంది. అందుకే అదే రంగాన్ని ఎంచుకుంది. 11నెలల కఠోర శిక్షణ ముగించుకొని లెఫ్టినెంట్‌గా పట్టానందుకుంది. అది చూసి పిల్లలిద్దరూ ఆనందంగా అమ్మను కౌగలించుకున్నారు. విధి పరిహాసం పాలైంది.

భర్త అంత్యక్రియల సందర్భంగా కుప్వారా నుంచి సతారాకు వెళుతుండగా నాకు కూడా ఈ డ్రస్ వేసుకోవాలని పించింది. దాంతో ఆయన మా వెంటే ఉంటారనిపించింది.







మానసిక, శారీరక బాధలు ఉన్నప్పటికీ రిటైర్ లెఫ్టినెంట్ కల్నల్ ప్రదీప్ బ్రహ్మకర్ శిక్షణనిచ్చే ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో జాయనయ్యానయ్యారు స్వాతి. 2015 నవంబరులో భర్త సంతోష్ మహదిక్ మరణించగా, ఫిబ్రవరిలో ఆమె ట్రైనింగ్‌కోసం దరఖాస్తు చేసుకున్నారు. స్వాతి మహదిక్(38) ఏడాది క్రితం చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీకి ఎంపికయ్యారు. తాజాగా 11 నెలల కఠోర శిక్షణ ముగించుకుని పుణెలోని ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్‌లో లెఫ్టినెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. మహదిక్‌కు సైనికాధికారిగా పనిచేయడం అంటే చాలా ఇష్టమని నేను కూడా సైన్యంలో చేరాలనుకున్నానని స్వాతి చెప్పారు. తమ ఇద్దరి పిల్లలను ఆయన ఎలా పెంచాలనుకున్నారో, ఏం చేయాలనుకున్నారో అది సాధించేవరకు శ్రమిస్తానని ఉద్వేగంగా వ్యాఖ్యానించారు. సంతోష్ మహదిక్ అసమాన ధైర్య సాహసాలకు శౌర్యచక్ర, సేనామెడల్ పొందారు.

## ఆమె

మరో ధీరవనిత నిధి మిశ్రా దూబే (29) ఆమె భర్త నాయక్ సైన్యం విధినిర్వహణలో మృతి చెందారు. ఆసమయానికి ఆమె నిండు గర్భిణి, ఆమె కూడా తన భర్త అడుగుజాడల్లోనే నడవాలనుకున్నారు. కుటుంబ పింఛన్‌కోసం ఆమె ఆర్ వినాయక్ దగ్గరికి వెళ్లినప్పుడు అమరవీరుల భార్యలకు మిలటరీలో చేరే సౌకర్యం ఉందని తెలిసింది. ఆపై ఆమె అనేక సార్లు దరఖాస్తులు పంపినా అవి స్వీకరణకు నోచుకోలేదు. దూబే పట్టుదల చూసి ఐదోసారి ఆమె దరఖాస్తును పరిశీలించారు. మహారాష్ట్ర రెజిమెంటల్ ఎస్ఎస్‌బీలో మే 2016న ఆమె శిక్షణకు ఎంపికయ్యారు. సైన్యంలో చేరాలన్న నిర్ణయం తీసుకున్నతర్వాత తన తల్లి అన్నలు ఎంతగానో తోడ్పాటు నందించారన్నారు. ఆమె కుమారుడిని ఆమె తల్లి దగ్గరే వదిలి అక్టోబర్‌లో ఆమె విధుల్లో చేరనున్నారు. అమ్మలిద్దరికీ సెల్యూట్...

## దసరా నవరాత్రుల ప్రాముఖ్యత



నవరాత్రి పదంలో నవ శబ్దం తొమ్మిది సంఖ్యను సూచిస్తుంది. నవరాత్రులను నవ అహోరాత్రాలు అని ధార్మిక గ్రంధాలు వివరిస్తున్నాయి. అంటే తొమ్మిది పగళ్ళు, తొమ్మిది రాత్రులు నిర్వర్తించే దేవి పూజకు ఒక ప్రత్యేక విధానం ఉంది. ఆశ్వయుజ శుక్ల పక్ష పాడ్యమి తిథి నుండి పూర్ణిమ వరకు తొమ్మిది రాత్రులు తొమ్మిది పగళ్ళు అమ్మవారిని పూజించడం ప్రశస్తంగా చెప్పబడింది. దీనినే 'శరన్నవరాత్రులు' లేదా 'దేవి నవరాత్రులు' అంటారు.

నవ రాత్రి వాస్తవానికి సంధికాలం. అందుచేత సృష్టికి కారణమైన మహా మాయ తీవ్రవేగం కలిగి ఉంటుంది. పూజాదుల చేత ఆమెను ఆహ్వానించటం సులభ సాధ్యం. తొమ్మిది రోజులు నవ దుర్గలను నిష్ఠగా ఉపాసించే ఆరాధకులకు దేవి అనుగ్రహం లభిస్తుంది. నవ రాత్రులలో రాహుకాల వేళ రాహుకాల దీపం వెలిగించాలి. రాహు ప్రతికూల ప్రభావం తగ్గి, దోష నివారణ జరుగుతుంది.

దేవి అర్చనలో లలితా సహస్రనామాలు, దుర్గాసప్తశతి పారాయణ చేసే భక్తుల కోరికలు నెరవేరుతాయి. రోగ పీడలతో బాధపడే వారు, జాతకంలో అపమ ృత్యు దోషం ఉన్నవారు ఈ తొమ్మిది రోజులు నియమం తప్పకుండా దేవి ఆరాధన చేయడం శుభకరం.

సాధారణంగా విజయదశమి నాడు శ్రవణ నక్షత్రం ఉంటుంది. నక్షత్ర మండలంలో శ్రవణ నక్షత్రం చెవి ఆకారంలో ఉంటుంది. అందుకే ఈ రోజు ఏదైనా కొత్త విద్యలు నేర్చుకోవాలనుకొనేవారు ఈ రోజు ప్రారంభిస్తే విశేషంగా లాభిస్తుంది. శమీ చెట్టు యొక్క పూజ ఈ రోజు విశేషంగా లాభిస్తుంది. జమ్మి చెట్టును పూజించడం లక్ష్మీప్రదమని పురాణాలు చెబుతున్నాయి. శమీ వృక్షం సువర్ణ వర్షం కురిపిస్తుందని శాస్త్రాల్లో ఉంది. విజయదశమి రోజున పూజలు అందుకొన్న జమ్మి చెట్టు ఆకులను ఇంట్లోని పూజాస్థలంలో, ధన స్థానంలో నగదు పెట్టెల్లో ఉంచుతారు. దీనివల్ల ధనవృద్ధి జరుగుతుంది.

పరమ శివునికి జగన్మాత దుర్గాదేవికి, సిద్ధి ప్రదాత గణపతికి శమీ పత్రి సమర్పించే ఆచారం అనాదిగా వస్తోంది. పూర్వం జమ్మి చెట్టు కాడల రాపిడి ద్వారా స ృష్టించిన అగ్నితోనే యజ్ఞ యాగాదుల క్రతువులు నిర్వహించేవారు. ఇవాల్టికి దేశంలోని వివిధ ప్రాంతాల్లో శమీ వ ృక్షంలో అగ్ని ఉంటుందనే విశ్వాసం ద ృడపడింది. అగ్ని వీర్యమే సువర్ణం కనుక జమ్మి బంగారం కురిపించే చెట్టుగా పూజార్హత పొందింది. ఈ రోజే శ్రీ రాముడు రావణునిపై విజయం సాధించాడు. విజయదశమి రోజునే శమీ పూజ కుడా నిర్వహిస్తారు.

శ్రీరాముని వనవాస సమయంలో కుటీరం జమ్మి చెట్టు చెక్కతోనే నిర్మించారని చెబుతారు. శమి అంటే పాపాల్ని, శత్రువుల్ని నశింపజేసేది. పంచ పాండవులు అజ్ఞాత వాసానికి వెళ్ళే ముందు తమ ఆయుధాలని శమీ చెట్టుపై పెట్టడం జరిగింది. సామాన్యులే గాక యోగులు నవరాత్రులలో అమ్మవారిని పూజిస్తారు. ముఖ్యంగా శాక్తేయులు దీనిని ఆచరిస్తారు. ఆలయాలలో అమ్మవారికి విశేష అలంకరణలు, బొమ్మల కొలువు పెట్టడం ఒక ఆనవాయితీ. ఈ తొమ్మిది రోజులు ఒక్కో రోజు ఒక్కో అలంకారం చేసి, పూజిస్తారు. అమ్మవారు లోక కళ్యాణం కోసం ఒక్కోరోజు ఒక్కో అవతారం ధరించింది. అందువలన అలా అమ్మవారు అవతరించిన రోజున, ఆ రూపంతో అమ్మవారిని అలంకరించి ఆ నామంతో ఆరాధిస్తూ ఉంటారు. అందరికి దేవి శరన్నవరాత్రి/ దసరా నవరాత్రుల శుభాకాంక్షలు.

## బిజినెస్

## ఆయనే ఓ బ్రాండ్

టీవీ, వార్తాపత్రికల్లో ప్రకటనలు సెలబ్రటీలు, లేదంటే సినిమా యాక్టర్లతో చేయించడం సర్వసాధారణం. అయితే విభిన్నంగా ఆలోచించేవారు నూతన మార్గాలను కనిపెడతారనడానికి ఈ ప్రకటనలోని కిరణ్ కుమారే నిదర్శనం. ఆయనే తన కంపెనీ గురించి ప్రకటన చేసుకోవడంతోపాటు ఆహార్యం, భాషతో అందర్ని కట్టిపడేస్తున్నారు.

కిరణ్‌కుమార్ చిన్నప్పుడే రాజస్థాన్ నుంచి వారి కుటుంబం పొట్టచేతబట్టుకొని నెల్లూరు వచ్చింది. అక్కడే ఆయన బంగారం పని నేర్చుకున్నారు. సృజనాత్మకంగా సొంత డిజైన్లు రూపొందిస్తూ చెన్నైలోని లలిత జ్యూయలర్‌లో అమ్ముతుండేవారు. దీనికోసం అతను చిన్నప్పటినుంచి పొదుపుచేసిన డబ్బుతోపాటు తల్లి బంగారు గాజులను కూడా తీసుకున్నాడు. ఎక్కడ



**లలిత జ్యూయెలర్స్ కిరణ్‌కుమార్**

అమ్మాలా అని ఎదురు చూస్తున్న అతనికి ఎదురుగా చెన్నైలోని లలిత జ్యూయెలర్స్ కనపడింది. దానిలోకి వెళ్లారు, అంతే దానికి ప్రధాన తయారీదారుడుగా ఉన్నారు. అదే సంస్థ 1999లో కష్టకాలంలో ఉంటే కిరణ్‌కుమార్ కొన్నారు. అలా తనను ప్రోత్సహించిన లలితా జ్యూయెలర్స్‌ను ఆయన మూతపడకుండా చేశారు. అంతేకాదు దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఆయనకు 12 షోరూంలు ఉన్నాయి. ఆయన వ్యాపారం ఏడాదికి రూ. 10వేల కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. అదంతా కిరణ్ కృషే అని చెప్పక తప్పదు. ఒకప్పుడు చదవడం రాయడం రాని కిరణ్‌కుమార్‌కు అమోఘ జ్ఞాపకశక్తి ఉంది. ఎంత ఎదిగినా మాతృభూమిపై మమకారం ఒదులుకోని ఆయన రాజస్థాన్‌లో 12 కోట్ల వ్యయంతో పాఠశాల, ఇతర మౌలిక సదుపాయాల కోసం వెచ్చిస్తున్నారు. 2018 తర్వాత తన లాభాల్లో సగాన్ని స్వచ్ఛంద సంస్థలకు, తద్వారా పేదల అభ్యుదయానికి ఉపయోగించాలని ఆయన నిర్ణయం తీసుకున్నారు. ఇదండీ కిరణ్‌కుమార్ ప్రస్తానం.. కృషితో నాస్తి దుర్భిక్ష్యం అనేది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన అంశం.

## ధరలేక టమోటా దిగాలు

(మొదటిపేజీ తరువాయి)

టమోటను 70 రూపాయలుగా మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రేటు బాగా ఉంటే గంప టమాటాలు రూ.200 నుండి 250గా విక్రయాలు జరుగుతాయి. టమాటా సాగులో పత్తికొండ ప్రత్యేకం. ఏటా ఒక్క పత్తికొండ నియోజకవర్గంలోనే సుమారు 1200 హెక్టార్లలో టమాటా పంటను సాగు చేస్తారు. ఇక్కడ పండించిన టమాటాను విజయవాడ,గుంటూరు, ఖమ్మం, బెంగుళూరు,తమిళనాడు. హైదరాబాద్ వరంగల్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు లారీల ద్వారా తరలిస్తారు. గత ఏడాది పంట దిగుబడి బాగా వచ్చినా గిట్టుబాటు ధరలేక రైతులు పొలం నుంచి టమాటాను మార్కెట్‌కు తరలించేందుకు బాడుగలు, కూలిలకు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో పండిన పంటను పశువులకు వదిలి రైతులు తీవ్రంగా నష్టాలపాలయ్యారు. ఈ ఏడాదైనా గిట్టుబాటు ధర వస్తుందని ఆశించిన రైతన్నకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉల్లికి గిట్టుబాటు ధరలేక ఆందోళనతో మనస్తాపం చెందిన జిల్లా రైతులు బలవస్మరణాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం టమాటా రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




## ఆర్థిక సంవత్సరంలో మార్పు లేదు

ఆర్థిక సంవత్సరాన్ని మార్చాలన్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసింది. ప్రస్తుతం ఏప్రిల్–మార్చి కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుండగా... దాన్ని కేలండర్‌తో సమానంగా జనవరి–డిసెంబర్‌కు మార్చాలని కేంద్ర గతంలో నిర్ణయించింది. అయితే పలు కారణాల దృష్ట్యా ఇప్పుడే దానిపై నిర్ణయం తీసుకోవడం లేదని కేంద్రం పేర్కొంది.



## యుద్ధవీరుడు అర్జన్ మృతి

ఐఏఎఫ్ మార్షల్ అర్జన్ సింగ్ (98) కన్నుమూశారు. గతవారం తీవ్ర గుండెపోటుతో ఢిల్లీలోని ఆర్మీ రెఫరెల్ ఆస్పత్రిలో చేరిన అర్జన్ చికిత్స ఫలితం లేకుండా కన్నుమూశారు. ఐఏఎఫ్ చరిత్రలో డిస్టింక్షన్ స్థాయి ప్రతిభ కనబర్చిన ఏకైక అధికారి ఈయన. 5స్టార్ ర్యాంక్ పొందిన అర్జన్ కెరీర్లో 60 విభిన్న విమానాల్లో ప్రయాణించారు. ఈయన సేవలకు గుర్తుగా బెంగాల్‌లోని పనాగర్ ఎయిర్‌బేస్‌కు 2016లో అర్జన్ వైమానిక స్థావరంగా పేరు పెట్టారు.

## ప్రభుత్వ చర్యలతో ఆర్థికమందగమనం

**ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి**

**ముంబై :** దేశ ఆర్థిక మందడమనం నిజమేనని ఎస్‌బీఐ రీఏర్చ్ వెల్లడించింది. 2016 సెప్టెంబరు నుంచి దుశ ఆర్థిక వ్యవస్థ మందగమనంలోనే కొనసాగుతోందని తెలిపింది. ఈ కొనసాగింపు వర్తమాన ఆర్థిక సంవత్సరం ప్రథమ త్రైమాసికం లోనూ ప్రతిఫలించిందని వివరించింది. ఇది కేవలం సాంకేతికాంశాలకే పరిమితమైన అంశం కాదని స్పష్టం చేసింది. అలానే సహజంగా స్వల్పకాలానికే పరిమితమైన అంశమూ కాదని తెలిపింది. మూడేళ్ల కనిష్ఠానికి 5.7 శాతంగా నమోదైన జీడీపీ వృద్ధిరేటును ప్రాస్తావిస్తూ సాంకేతిక కారణాల వల్లనే జీడీపీ వృద్ధిరేటు మందగమనంలో పడిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా వ్యాఖ్యానించారు. ఈనేపథ్యంలో ఆర్థిక మందగమన పరిస్థితిపై ఎస్‌బీఐ రీసెర్చ్ స్పందించడం గమనార్హం. ప్రస్తుతం మందగమ స్థితి నుంచి పుంజుకోవడానికి ప్రభుత్వ వ్యయం పెరగడమొక్కటే తక్షణ పరిష్కారంగా ఎస్‌బీఐ రీసెర్చ్ సూచించింది. వ్యయాన్ని విస్తరించడంలో విచక్షణ చూపాలని తెలిపింది. ఆర్థిక లోటును పరిగణనలోకి తీసుకుని వ్యయ విధానాన్ని అమలు జరపాలని ప్రభుత్వానికి ఎస్‌బీఐ రీసెర్చ్ సూచించింది. అదే సమయంలో రుణాల లెక్కలకు అవాంతరాలను కల్పించరాదని హితవు పలికింది. గతంలో ప్రభుత్వం ఇలాంటి చర్యలు అమలు జరిపిన సందర్భాల్లో వాటిని 'ఆర్థిక దివాళా'గా రేటింగ్ ఏజన్సీలు చెప్పే విషయాన్ని గుర్తు చేసింది. ఆయా ప్రభుత్వాలు తమ విధాఅలను మార్చుకోక పోతే రేటింగ్‌కు కోత పెడతామంటూ ఆయా దేశాలను ఏజన్సీలు హెచ్చరిస్తూండేవి తెలిపింది.

# సీడ్ యాక్సిస్ ఎప్పటికి పూర్తయ్యేనో?

**రాజధానిప్రతినిధి, అమరావతి :** సీడ్ యాక్సిస్ రాజధానికే తలమానికం అవుతుందని సీఆర్‌డీఏ ప్రకటించింది. తొలిదశలోనే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటు ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో రెండో దశకి భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయడంతో మరింత జాప్యం జరగనుంది. సీడ్ క్యాపిటల్‌కి అనుసంధానిస్తూ నిర్మించే ఈ రహదారిని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది.

**సీడ్ యాక్సిస్ నిర్మాణం :** కనకదుర్గమ్మ వారధి నుంచి ప్రారంభమయ్యే ఈ రహదారి రెండు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీలో 18.3 కిలోమీటర్ల రహదారిని నిర్మించాలని భావించారు. రెండో ప్యాకేజీలో 3.5 కిలోమీటర్ల రహదారిని నిర్మించాలన్నది ప్రభుత్వ నిర్ణయం. అయితే రూ.575 కోట్లతో అంచనాలతో ప్రారంభమైన సీడ్ యాక్సిస్ నేటికీ ఓ కొలిక్కిరాలేదు. వారధి, సీతానగరం, ఉండవల్లి, తాడేపల్లి ఉద్దండ్రాయునిపాలెం, రాయపూడి, వెంకటయపాలెం గ్రామాల నుంచి బోరుపాలెం వరకు సీడ్ యాక్సిస్ నిర్మించే విధంగా ప్లాన్ రూపిందించారు. తొలివిడత నిర్మాణం ముందుగా వేగవంతంగా సాగినప్పటికీ తరువాత నెమ్మదించింది. 60 మీటర్ల వెడల్పుతో బీఆర్టీఎస్ కారిడార్ నడుమ ఏర్పాటౌతున్న సీడ్ యాక్సిస్ రాజధానికే తలమానికం అవుతుందని సీఆర్‌డీఏ ప్రకటించింది. తొలిదశలోనే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటు ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో రెండో ధశకి భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయడంతో మరింత జాప్యం జరగనుంది. సీడ్ క్యాపిటల్‌కి అనుసంధానిస్తూ నిర్మించే ఈ రహదారిని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది.

### ప్లాన్ మార్చే లోచనలో ప్రభుత్వం

రాజధాని గ్రామాల్లో భూసేకరణపై రణం కొనసాగుతూనే ఉంది. అమరావతి నిర్మాణార్థం భూములు సేకరణకు నోటీసులిచ్చిన ప్రభుత్వం పలు గ్రామాల్లో రైతుల నుంచి వ్యతిరేకత చవిచూడాల్సి వచ్చింది. అనుకూల గ్రామాల్లో సైతం కోర్టులకు వెళ్ళి స్టే తెచ్చుకున్న పరిస్థితులేర్పడ్డాయి. ప్రస్తుతం సీడ్ యాక్సిస్ రహదారి కోసం 162 ఎకరాల భూసేకరణకు బహిరంగ నోటీసు జారీచేసింది. ఉండవల్లి గ్రామాల్లో ఈ భూమిని సేకరించనున్నట్లు నోటీసులో ప్రకటించారు. అయితే ఇప్పటికే ఈ రహదారి నిర్మాణం అటుపోట్లని ఎదుర్కొంటూ



ముందుకు సాగుతోంది. కనకదుర్గమ్మ వారధి వద్ద ప్రారంభమయ్యే సీడ్ యాక్సిస్ 21.8 కిలోమీటర్ల పొడవుతో నిర్మితంకానుంది. ఆరులైన్లతో నిర్మించే ఈ రోడ్డు బోరుపాలెం వరకు నిర్మించనున్నారు. ఈ రహదారి పలు గ్రామాల, పంట భూముల గుండా నిర్మితం కానున్న నేపథ్యంలో కొందరు రైతులు ఇప్పటికే కోర్టును ఆశ్రయించారు. రోడ్డు ఆరంభ గ్రామాలైన ఉండవల్లి, పెనుమాకల్లో రైతులు భూమి ఇచ్చేందుకు నిరాకరిస్తూ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. బాధితులంతా కోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేసేందుకు సమాయత్తమయ్యారు.

**నివాసాలు తొలగించడం....:**
తొలిదశ నిర్మాణంలో నివాసాలు తొలగించాల్సి రావడంతో ఆయా గ్రామాల్లో రహదారి నిర్మాణం నిలిచిపోయింది. ప్రధానంగా రాయపూడి గ్రామంలో అధిక శాతం నివాసాలు తొలగించాల్సి రావడంతో ఆయా గ్రామాల్లో రహదారి నిర్మాణం నిలిచిపోయింది. అదే క్రమంలో దొండపాటు దగ్గర చెరువులో రహదారి నిర్మించాల్సి ఉండటం ఇలా పలు గ్రామాల్లో ఇక్కట్లు ఎదుర్కొంటోంది.

**ఎత్తుగడ మారుతోంది.....**
ఈ భూసేకరణ ఇబ్బందుల నుంచి బయట పడాలనే ఆలోచనతో ప్రభుత్వం కొత్త ఎత్తుగడలకు ప్రణాళిక రచిస్తోంది. రహదారి ప్లాన్‌లో స్వల్పమార్పులు చేసి నివాసాల మీదుగా నిర్మించాలనే ఆలోచనకు ప్రభుత్వం వచ్చింది. ఈ క్రమంలోనే ఉండవల్లిలో నివాసాలు తొలగించే పరిస్థితి ఏర్పడనుంది. భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తున్న ఉండవల్లి వాసులపై ఆది నుంచి ఆగ్రహంతో ఉన్న ప్రభుత్వం ఏదో రూపంలో సీడ్ యాక్సిస్ రహదారి పూర్తిచేయాలనే ఆలోచనలో ఉంది. ఈ నేపథ్యం లో ప్లాన్ మారుస్తుందా లేక భూసేకరణ ద్వారానే పాత ప్లాన్ ప్రకారమే నిర్మిస్తుందా అనేది సందిగ్ధంగా మారింది.

## కబుర్లు



**జైట్లీ :** బాస్, బుల్లెట్ ట్రైన్ కోసం లక్షా ఇరవైఐదువేల కోట్లు ఖర్చుపెట్టి గుజరాత్, మహారాష్ట్రాలకి దోచిపెడుతున్నామని, వాళ్లు అమరావతి కట్టుకోటానికి కేవలం చెంబుడు నీళ్ళిచ్చామని ఆంధ్రావాళ్ళు వాట్సాప్, ఫేసుబుక్కుల్లో బాగా విమర్శిస్తున్నారు... ఏం చేయమంటారు??

**మోడీ :** వాట్సాప్, ఫేసుబుక్ వాడితే ఒక్కోదానికి రోజుకి10రూపాయలు చొప్పున యూజర్ చార్జీ ఏసెయ్... తిక్క కుదురుద్ది ఎదవలకి... విమర్శలు కూడా తగ్గిపోతాయ్

**జైట్లీ :** వాటిమీద యూజర్ చార్జీ ఎయ్యటానికి మనకి హక్కులేదేమో...

**మోడీ :** అదే నీ చాదస్తం.. యూజర్ చార్జీ కాకపోతే జీ.ఎస్.టీ. గుద్దు... ఎవుడికీ అర్థం కాదు....

### సరదా ప్రశ్నలు.. కొంటె జవాబులు...

ప్ర: సుఖంగా ఉన్న ప్రాణాని కష్టపెట్టడం అంటే?
జ. పెళ్లి చేసుకోవడం.

ప్ర: చావుకు ఎదురు వెళ్లడం అంటే?
జ. భార్యకు ఎదురు చెప్పడం

ప్ర: గోడకు తల బాదుకోవడం అంటే ?
జ. భార్యకు ఏదైనా అర్థమైయ్యేలా చెప్పడం.

ప్ర: స్వర్గం నరకం అంటే?
జ. భార్య పుట్టింటికి వెళ్లడం,
నాలుగు రోజుల్లోనే తిరిగి రావడం.

ప్ర: పగ తీర్చుకోవడం అంటే ?
జ. పెళ్లి చేసుకోమని ఒకరికి సలహా ఇవ్వడం.

ప్ర: సొంత లాభం చూసుకోవడం అంటే?
జ. పెళ్లి చేసుకోకుండా ఉండటం.

ప్ర: పాపానికి శిక్ష అంటే?
జ.పెళ్లి జరగడం.

ప్ర: లవ్ మ్యారేజ్ అంటే?
జ.మనతో యుద్ధం చేయదానికి శత్రువుని చూసుకోవడం

ప్ర: పులి నోట్లో తల పెట్టడం అంటే?
జ. పెళ్లికి సరే అనడం.

ప్ర: పెళ్లి ఫోటోలు చూడడం అంటే?
జ. చేసిన తప్పుకు పశ్చాత్తాప పడటం.

11.పెళ్లిఅంటే?
జ. చేయని నేరానికి శిక్ష

### జీవితోపదేశం

పుట్టినవారికి వివాహం తప్పదు,
పెళ్లైన వారికి భార్యతో బాధలు తప్పవు,
అనివార్యమగు విషయము గూర్చి శోకింపజాలదు.
తప్పించుకున్న వాడు ధన్యుడు సుమతీ.



శాంతిరామ్ ఆసుపత్రిలో
ఉచిత వైద్యం


కర్నూలు జిల్లా నంద్యాల నుండి కేవలం 5 కి.మీ. దూరంలో శాంతిరామ్ మెడికల్ కాలేజ్ & జనరల్ హాస్పిటల్ కలదు. అక్కడ అన్నిరకాల రోగములకు ఫీజు లేకుండా వైద్యం,ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నారు.పేషంట్‌కు ఆహారం, నీరు వంటి వాటికిడబ్బులు ఏమీ తీసుకోరు.అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.అధునాతనమైన ఎం.ఆర్.ఐ.స్కానింగ్, సి.టి. స్కాన్, అత్యాధునిక ల్యాబ్ సౌకర్యం కలదు. తెల్ల రేషన్‌కార్డు కలిగిన రోగులకు ఎన్.టి.ఆర్.వైద్య సేవ, ఎంప్లాయిూ హెల్త్ స్కీమ్(ఇ.హెచ్.ఎస్) సౌకర్యం కలదు.ఆసక్తిగలిగిన వారు ఫీజులేని ఈ వైద్యాన్ని పూర్తిగా వినియోగించుకొనగలరని కోరుచున్నాము.మరిన్ని వివరాల కోసం ఫోన్ :08514-222444,సెల్: 9866348446 సంప్రదించండి.

# బాబాలందరిదీ ఒకే దారి...









వివాదాస్పద డేరా బాబా రామ్ రహీమ్ అరెస్టు అనంతరం చెలరేగిన హింసాకాండ నేపథ్యంలో 'అఖిల భారతీయ అఖార పరిషత్' నకిలీ బాబాలకు ముకుతాడు వేయడానికి 'సంత్' టైటిల్ ప్రదానానికి ఎవరు అర్హులో నిర్ణయించేందుకు యంత్రాంగాన్ని రూపొందించింది. ఇందుకోసం అఖిల భారతీయ అఖారా పరిషత్‌తో కలిసి విశ్వహిందూ పరిషత్ పనిచేస్తుందని ప్రకటించారు. అయితే బాబాలలో మంచి బాబా, చెడ్డబాబా అని ఉండరు బాబా లందరిదీ ఒకే దారి. స్థాయితక్కువవాళ్లు రోడ్లపక్కన గారడీ పనులు చేస్తూ కడుపునింపుకుంటారు.. అవే పనులను కోటు వేసుకొని నెత్తిన టోపి పెట్టుకొని చేసేవారిని మెజీషియన్ అంటాము. అయితే ఇవే పనులను కాషాయ బట్టలు వేసుకొని, ముఖాన వీబూది పూసుకొని, మెడలో రుద్రాక్షలు వేసుకొని చేసే వారిని బాబాలు అంటాము. వీరికి చదువు సంధ్యలు పని లేదు. కావలసిందల్లా ఉన్నతచదువులు చదివినవారిని సైతం బురిడీ కొట్టించగల నాలుగు మాటలు. దీనికి ఉదాహరణ జైలు ఊచలు లెక్కిస్తున్న డేరాబాబానే.. ట్రక్ డ్రైవర్ బాబాగా మారి అంతులేని సంపద, సౌకర్యాలు పొందాడు. ప్రజల అమాయకత్యాన్ని, అజ్ఞానాన్ని ఆసరా చేసుకొని మంత్రులను, గవర్నర్లను, అధికారులను బుట్టలో వేసుకొని వారి అండతో ప్రభుత్వ భూములు ఆక్రమించి ఆశ్రమాల పేరుతో వాటిని నేర సామ్రాజ్యాలుగా మారుస్తున్నారు. పైకి ప్రశాంతంగా కనిపించినా,వీరి మాటలు మాత్రం మహాకటువు.. ప్రపంచ శాంతికి యోగం, ధ్యానం తప్పవంటూ తీవ్ర అసహనంతో ఇతర మతాలపై దాడులకు పురిగొల్పుతారు. **సోమయ్య, పెంటయ్యగా ఉన్న వారు బాబాలుగా మారి ప్రేమానందస్వామి, నిత్యానందస్వాములుగా మార్చుకుంటారు. అందరిలాగా వీరికీ జుట్టు నెరుస్తుంది.శరీరం ముడతలు పడుతుంది, గోళ్లు పెరుగుతాయి. అందరిలాగా రోగం వస్తే ఆసుపత్రికి వెళతారు. కానీ భక్తులను మాత్రం తన మహిమతో తగ్గిస్తామని రప్పించుకుంటారు.** కొంత మంది బాబాలు రోగంతో చనిపోయింది కూడా బయటి ప్రపంచానికి తెలియని పరిస్థితి వుంది. పుట్టపర్తి సాయిబాబా, పెనుగొండ కాళీ ప్రసాదులకు ఏ రోగం వచ్చిందో డాక్టర్లు కూడా చెప్పలేదు. బాబాలెంతమంది ఉన్నప్పటికీ అందరికీ ఉన్న సారూప్యం ఏమంటే ప్రభుత్వ భూములు ఆక్రమించడం. హత్యలు,అత్యాచారాలు,మారక ద్రవ్యాల అమ్మకాలు, చెక్ బౌన్స్ కేసులు సర్వసాధారణం, **అయితే కొన్ని కొన్ని పత్రికలలో 14 మంది బాబాలే నేరస్తులు, మిగతావారు మంచి వారు అన్నట్లుగా ఒక సంత్‌ల సంఘం పేర్కొన్నారు.** అసలు సంతులే పెద్ద దొంగలు, ఉత్తర భారతంలో సంతులదే రాజ్యం. వీరంతా బ్రహ్మచర్యం పాటిస్తున్నామంటూ పెళ్ళి చేసుకొని పిల్లలను కంటుంటారు. మఠాదీశులు, సాధువులు, సంతులు, మహంతులుగా వ్యవహరిస్తారు. ఏ ప్రాంతంలో ఉన్నవారు, ఆ ప్రాంతంలో పెత్తనం సాగిస్తుంటారు. **వీరందరి మీద క్రిమినల్ కేసులు ఉంటాయి.ఒకరంటే ఒకరికి పడదు.ఎవరి రాజ్యం వారిదే, అందరికీ సొంత సైన్యం ఉంటుంది. రాజకీయ నాయకులకు వీరికీ దగ్గర సంబంధాలు ఉంటాయి. ఎన్నికల్లో ఒకరికొకరు మద్దతు తెలుపుతుంటారు.** పరిస్థితులు ఈ విధంగా ఉండగా ఆఖారా పరిషత్ సంతులు అంటే వారేదో ఆకాశం నుండి ఊడిపడినట్లు, వారు చాలా పవిత్రులైనట్లు పేర్కొనడం వారినిసమర్ధించడమే అవుతుంది. అమ్మాయిలతో వికృత చేష్టలు చేసిన పత్రిజీ సంగతి ఏమిటి? నిత్యానంద స్వామి సంగతి ఏమిటి? **ప్రభుత్వ భూములు ఆక్రమించి జల్సా చేస్తున్న రామ దూత, సుందర చైతన్య స్వామి, యమునా నది ఒడ్డును సర్వనాశనం చేసిన రవిశంకర్, పతాంజలి వస్తువుల పేరుతో మోసం చేస్తున్న రాందేవ్ బాబా,యోగా పేరుతో మోసం చేస్తున్న జగ్గీ వాసుదేవ బాబా, మాతా అమృతానందమయి, ఇంకా వేలాదిగా వున్న అమామ్ బాపతు బాబాలా సంగతి ఏమిటి? వీరందరి మీదా నిఘా కమిటీ వేసి నిగ్గు తేల్చవలసిన అవసరం ఎంతైనా ఉంది.**

బాబాల పీడ నుండి ప్రజలను చైతన్యవంతులను చేయవలసిన భాధ్యత ప్రభుత్వం, మేధావులు, హేతువాదులపై వుంది.

– బోస్

## చేపలు తిన్నాక పాలు తాగవచ్చా..?

పాలు, చేపలు. ఇవి రెండూ మనకు మంచి పౌష్టికాహారంగా ఉన్నాయి. చాలా మంది చేపలను ఇష్టంగా తింటారు. అయితే చేపలను తినని వారు చాలా మంది పాలు తాగుతారు. ఈ క్రమంలో చేపలను తినే వారు, పాలు తాగేవారికి ఎప్పటి నుంచో ఓ సందేహం ఉంటూ వస్తున్నది. చేపలు తిన్నాక పాలు తాగవచ్చా లేదా అని చాలా మంది సందేహిస్తుంటారు. అయితే దీనికి ఆయుర్వేదం ఏం చెబుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.



ఆయుర్వేదం ప్రకారం పాలు మన శరీరానికి కూలింగ్ ఎఫెక్ట్ ఇస్తాయి. అయితే చేపలు మాత్రం హీటింగ్ ఎఫెక్ట్‌ను కలగజేస్తాయి. ఈ క్రమంలో రెండింటినీ ఒక దాని వెంట ఒక తీసుకుంటే దాంతో శరీరంలో రియాక్షన్ ఏర్పడుతుంది. దీని వల్ల రక్తం ఇన్‌ఫెక్షన్‌కు గురై చర్మ సంబంధ వ్యాధులు వస్తాయని ఆయుర్వేదం చెబుతున్నది. కనుక ఈ రెండింటినీ ఒకేసారి తీసుకోకూడదు.

అయితే చేపలు మాత్రమే కాదు, చికెన్, మటన్ తిన్నాక కూడా పాలను తాగకూడదు. ఎందుకంటే అన్నింటిల్లోనూ ఉండే ప్రోటీన్ శరీరానికి పెద్ద ఎత్తున అందుతుంది కనుక అది జీర్ణం అయ్యేందుకు చాలా సమయం పడుతుంది. దీంతో గ్యాస్, అజీర్తి వస్తాయి. ఇక గుండె జబ్బులున్న వారు ఇలా తినడం ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు.

ఆరోగ్యం

## నిమ్మ జాతి పండ్లు తినాలి



ఇంట్లో తీరిగ్గా వున్న, ఏదైనా తెరిగ్గా సినిమా చూస్తూన్నా లేదా ఒత్తిడి అనిపించినా ఎదో ఒక్కటి తినేయాలనిపిస్తుంది. అప్పుడు నిమ్మజాతి పండ్లే అందుబాటులో వుంచుకుంటే అవి చాలా మేలు చేస్తాయి. నిమ్మ, నారింజ, బత్తాయి, కమలా వంటి పండ్లలో వుండే సి విటమిన్ రక్తంలో చక్కర స్థాయిల్ని నెమ్మదిగా విడుదలయ్యేలా చేస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి సిట్రస్ రకాలు. ఇన్ ఫెక్షన్లు రానీయవు జలుబు, జ్వరం, దగ్గు రానీయవు. ఒక వేల వచ్చినా తొందరగా కోలుకునేలా చేస్తుంది. అలసట ఎంత మాత్రం రాదు. ఎండ కారణంగా నల్లబడిన చర్మం యధా స్థితికి వస్తుంది. వార్ధక్యపు భయాలు దగ్గరవ్వవు. ఇవి మంచి పోషకాలు.

# గోడమీది పిల్లులు రెడీ?

- టీడీపీతో టచ్‌లో ఏడుగురు వైసీపీ ఎమ్మెల్యేలు
- వైసీపీతో ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేల చెట్టపట్టాల్
- దసరా ముహూర్తంగా నిర్ణయం

**రా.వా.ప్రతినిధి,అమరావతి:** రాష్ట్రంలో మరోసారి భారీ పార్టీ ఫిరాయింపులకు తెరలేవబోతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.అధికార పార్టీ తెలుగుదేశంలోకి జంప్ చేసేంగుకు కొందరు వైసీపీ ఎమ్మెల్యేలు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే వైసీపీ నుంచి 21 మంది ఎమ్మెల్యేలు టీడీపీలో చేరారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన భూమా నాగి రెడ్డి చనిపోవటం, నంద్యాలకు ఉప ఎన్నికలు జరిగి ఆయన సోదరుడి కుమారుడు బ్రహ్మానందరెడ్డి గెలుపొందిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఇటీవల జరిగిన నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో విజయంతో టీడీపీలో జోష్ పెరిగింది. వైసీపీ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై శాసనసభలో, కోర్టుల్లో ప్రతిపక్ష వైసీపీ ఫిర్యాదులు విచారణలో ఉన్నాయి. ఈ సమయంలో కొందరు వైసీపీ ఎమ్మెల్యేలు టీడీపీలో చేరే ఆలోచన ప్రారంభించారు. దానికి తగ్గట్టుగానే ఆ ఎమ్మెల్యేలను చేర్చుకొనేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వైసీపీ నేతలు తమతో టచ్‌లో ఉన్నారని మంత్రి నారా లోకేష్, ఇతర మంత్రులు కొద్దికాలం నుంచి చెప్పుకొస్తున్నారు. శాసనసభలో వైసీపీ వాస్తవబలం 67.21 మంది పార్టీ ఫిరాయించడంతో వైసీపీకి శాసన సభలో 46 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.సాంకేతికంగా మరో నలుగురు ఎమ్మెల్యేలు వైసీపీ నుండి టీడీపీలోకి చేరితే పార్టీలో చీలిక వర్గంగా గుర్తింపు లభిస్తుంది.ఈ కారణాన అధికార పార్టీ తెలుగుదేశం నేతలు కూడా ప్రతిపక్షం నుంచి ఎమ్మెల్యేలను చేర్చుకొనేందుకు ఉత్సాహం చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఏడుగురు వైసీపీ ఎమ్మెల్యేలు టీడీపీ అధిష్టానం టచ్‌లో ఉన్నారని సమాచారం.వారిలో గుంటూరు జిల్లా నుండి ఇద్దరు, ప్రకాశం,నెల్లూరు నుండి ఒకొక్కరు,కర్నూలు నుండి ఇద్దరు ఎమ్మెల్యేలు, వీరితో పాటు ఓ ఎంపీ, ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు టీడీపీలో చేరనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. వీరు కాక ఉత్తరాంధ్ర నుంచి ఓ ఎమ్మెల్యే, ఓ ఎమ్మెల్సీ కూడా టీడీపీ నేతలతో సత్సంభందాలు కొనసాగిస్తూ తాము కూడా టీడీపీలో చేరన్నారని సమాచారం.

వైసీపీ టచ్‌లో ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు: అధికార పార్టీలో చేరేందుకు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉత్సాహం చూపటం సహజం.అయితే ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలుగా ఉన్న ఇద్దరు వైసీపీ నేతలతో చెట్టపట్టాల్ రాజకీయాలు నడుపుతున్నారు. వీరికి 2019 ఎన్నికలలో టీడీపీ టిక్కెట్లు దక్కవనే దక్కవని పార్టీ క్యాడర్ కన్నా వారికే నమ్మకం కుదిరి ముందుగానే ప్రతిపక్ష పార్టీలో బెర్త్‌లు రిజర్వు చేసుకుంటున్నట్లు సమాచారం. వీరిలో ఒకరు వైసీపీలో చేరి బాపట్ల నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు ఉవ్విళ్ళూరుతున్నారు. మరొకరు పల్నాడులోని ఏదో ఒక నియోజక వర్గం నుండి వైసీపీ అభ్యర్ధిగా పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అయితే వీరు 2018 ద్వితీయార్ధంలో పార్టీని వీడేందుకు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

# రైతులకు 'హైటెన్షన్'

**కోర్టు కేసుకు చిత్తూరు రైతులు**

**తిరుపతి :** వ్యవసాయ క్షేత్రాల్లో హైటెన్షన్ విద్యుత్ టవర్లు ఏర్పాటు చేయడం రైతుల్లోఆగ్రహం రేపుతోంది. టవర్ల ఏర్పాటుకు ఉద్దేశించిన నిబందనలను ట్రాన్స్మిషన్ కంపెనీ కానీ కాంట్రాక్టరు కానీ పాటించడం లేదని బాధిత రైతులు చెబుతున్నారు. చిత్తూరు జిల్లాలోని కలికిరి మండలంలో రైతుల సమ్మతి లేకుండా ఏర్పాటు చేస్తున్న హైటెన్షన్ విద్యుత్ టవర్ల విషయం ప్రస్తుతం తీవ్ర వివాదాస్పదంగా మారింది. అభ్యంతరాలు వ్యక్తం చేసిన రైతులును కాంట్రాక్టరు నియమించిన సిబ్బంది తీవ్రంగా బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వానివని అడ్డుకుంటే కటకటాల్లో పోవాల్సి వస్తుందని తమను బెదిరిస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈతరహా బాధితలు ఒక్క కలికిరి మండలంలోనే 400ల నుంచి 500ల మంది రైతుల వరకు ఉంటారు. కడప–చత్తీస్‌ఢ్‌ల మధ్య విద్యుత్ సరఫరాకు ఉద్దేశించి ఈటవర్ల ఏర్పాటు జరుగుతున్నట్లు సమాచారం.

ఒక 765కేవీ సామర్థ్యం కలిగిన హైటున్షన్ కేబుల్ అమర్చేందుకు ఉద్దేశించిన టవర్ నిర్మాణానికి 20 సెంట్ల భూమి అవసరమవుతుంది. టవరు నిర్మాణంతో ఈ భూమి రైతుకు ఏవిధంగానూ ఉపయోగపడదు. టవర్ల నుంచి వెలువడే రేడియేషనుతో పంటలు పండవని రైతులు చెబుతున్నారు. ఒక టవరు నుంచి మరో టవర మధ్యన ఉన్న కేబుల్ నుంచీ రేడియేషను వెలువడుతుందని రైతులు చెబుతున్నారు. టవర్ల ఏర్పాటు కోసం ప్రొక్లెయినర్ వంటి భారీ యంత్రపరికరాలను ఉపయోగిస్తుండటంతో తమ పంటలన్నీ మొలక దశలోనే ధ్వంసమవుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతులకు, కాంట్రాక్టరు సిబ్బందికి మధ్యన తీవ్ర వాగ్వివాదం జరిగింది. రైతుల ప్రతిఘటనకు సిబ్బంది ఎక్కడి పనులు అక్కడే నిలిపి వేశారు. విద్యుత్ చట్టం ప్రకారం వ్యవసాయ క్షేత్రాల్లో టవర్ల ఏర్పాటు చేయాలనుకున్నపుడు జీఓ 24లోని సెక్షన్ 3(1ఏ) ప్రకరం రైతులు అనుమతి తప్పని సరి రూల్ 3(2) కింది రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తే ప్రతిపాదిత టవరు ఏర్పాటుకు కలెక్టరు చర్చలు జరిపి టవర్ల ఏర్పాటు ద్వారా రైతుకు వాటిల్లే నష్టం ఎంత.? నష్టపరిహారం ఎంత చెల్లించాలి లేదా వార్షిక అద్దె రెండూ చెల్లించాలా అనేది నిర్ణయించే అధికారం కలెక్టరుకు ఉంది. ప్రభుత్వ చట్టం ప్రకారం ఒక టవరు ఏర్పాటుకుగాను వాటిల్లే నష్టంకుగాను 100 శాతం నష్టంపరిహారం పొందేందుకు రైతులు అర్హులు. అలానే కేబుల్ లైన్ల దిగువ భూమిలో పంట నష్టానికిగాను భూమి విలువలో 10 శాతం నష్టపరిహారం పొందేందుకు అవకాశం ఉంది. ఇటీవల అనంతపురం జిల్లాలో ఇదే తరహాలో హైటెన్షన్ టవర్ల నిర్మాణం విషయం వివాదాస్పదమై తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడిన ఉదంతాన్ని సూమోటోగా స్వీకరించిన హైకోర్టు దీనిపై ఒక కేసును నమోదు చేసిన ఉదాంతాన్ని రైతులు గుర్తు తెచ్చుకుంటున్నారు.

# 'న్యూటన్' కాపీయా ?




సినిమా

**ముంబై :** బాలీవుడ్ చిత్రం'న్యూటన్'ఊహించని రీతిలో ఆస్కార్ బరిలో నిలిచింది. చిత్రదర్శకుడు అమిత్ మసూర్‌కర్ తీసిన పొలికల్ సెటైర్ 'న్యూటన్' లో 'బరేలీ కి బర్ఫీ' ఫేం రాజ్‌కుమార్ రావు ప్రధాన పాత్ర పోషించారు. ప్రతిష్టాత్మక ఆస్కార్‌లో న్యూటన్ ఎంపికైనట్టు ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఫ్ఐ) ప్రకటించింది. ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించిన బాహుబలి2, దంగల్ గౌతమిపుత్ర శాతకర్ణి చిత్రాలు న్యూటన్ ముందు తేలిపోయాయి. ఆస్కార్–2018 ఉత్తమ విదేశీ చిత్రంగా తన రెండో చిత్రం 'న్యూటన్' ఎంపిక అవుతుందని ఊహించలేని డైరెక్టర్ అమిత్ అన్నారు. 26 సినిమాలు రేసులో నిలవగా ఎఫ్ఎఫ్ఐ కమిటీ హెడ్‌గా ఉన్న తెలుగు నిర్మాత సీవీ రెడ్డి ఈ చిత్రాన్ని ఉత్తమ విదేశీ చిత్రంగా ఎంపిక చేయడం విశేషం.ఈ ఏడాది 26 ఎంట్రీలు రాగా హిందీ చిత్రం 'న్యూటన్' కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక చేసిందని ఎఫ్ఎఫ్ఐ సెక్రటరీ జనరల్ సుప్రన్ సేన్ వెల్లడించారు. శుక్రవారం విడుదలైన ఈ కమర్షియల్ చిత్రం ఆస్కార్‌కు ఎంపిక కావడం 'చెర్రి ఆన్ ది కేక్' అంటూ హీరో రాజ్‌కుమార్ తన ఆనందాన్ని వ్యక్తపర్చారు. ఇది చాలా నిజాయతీగల చిత్రమని, ఇప్పటికే అందరి మన్ననలు పొందుతోందని ఆయనన్నారు. న్యూటన్ ఆస్కార్ బరిలో నిలవడంపై దర్శకుడు అమిత్ అమితానందాన్ని వ్యక్తంచేశారు. చిత్రం ఈ రోజే విడుదలవడం ఇదే రోజు ఆస్కార్ బరిలో నిలవడం తమ సంతోషం రెట్టింపు అయిందని అన్నారు. ఈ తాజా పరిణామంతో ప్రేక్షకులు న్యూటన్ కోసం సినిమాహాళ్ల బాట పడతారని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. నిజాయితీగల ఎన్నికల అధికారి నేపథ్య పొలిటికల్ సెటైర్ 'న్యూటన్' ఘర్షణాత్మక చత్తీస్‌గఢ్‌లో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు కథానాయుకుడు చేసే ప్రయత్నాలే ఈ చిత్రం కథాంశం. ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు లక్ష్యంతో ఆ పాత్ర చేసే యత్నాలను కళ్లకు కట్టినట్టు చూపించారు. సినిమాలో పంకజ్ త్రిపాఠి రఘుబీర్ యాదవ్, అంజలీ పాటిల్ తదితరులు నటించారు.

**ఎన్నికల వ్యవస్థపై సాధారణ ఉద్యోగి పోరాటం!**

ఓ సాధారణ ప్రభుత్వద్యోగి న్యూటన్ కుమార్ (రాజ్‌కుమార్ రావ్) ఎన్నికల విధుల నిమిత్తం చత్తీస్‌ఘడ్‌లోని ఓ మారుమూల అటవీ ప్రాంతానికి వెళతాడు. అదంతా నక్సల్స్ ప్రభావితం ప్రాంతం కావడంతో న్యూటన్‌కు పలు సవాళ్లు ఎదురవుతాయి. వాటన్నింటిని అధిగమించి ఎన్నికలు ప్రశాంతంగా జరిపించాలనుకుంటాడు. అందుకోసం అతడు ఏం చేశాడు? అనేది అసలు కథ. దశాబ్దాలుగా కనీసం పోలింగ్ బూత్ ముఖం చూడని వ్యక్తులు ఎంతోమంది దేశంలో ఉన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు జరుగుతున్న తీరుపై పలు ప్రశ్నలు సంధించారు. దర్శకుడు. దేశంలో ఉన్న పెద్ద సమస్యల్నీ చాలా సున్నితంగా కాస్త వినోదాన్ని జోడించి దర్శకుడు ఈ చిత్రంలో చూపించిన తీరుకి ప్రశంసలు లభిస్తున్నాయి. 67వ బెర్లిన్ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రశంసలు దక్కించుకొంది. చిత్రం దీంతో పాటు ట్రిబెకా చిత్రోత్సవంలోను ఈ చిత్రం ప్రదర్శితమైంది. అయితే ఇరాకీ సినిమా సీక్రెట్ బ్యాలెట్ చిత్రానువాదం అని దుమారం చెలరేగింది. సీక్రెట్‌బ్యాలెట్‌లో శృంగారం ఉందని ఈ సినిమాలో కామెడీ ఉందని, దానిలో మహిళా పాత్రధారి ఉండగా, దీనిలో హీరో ఉన్నాడంటూ దర్శకుడు వివరణ ఇస్తూ, న్యూటన్‌కు, సీక్రెట్ బ్యాలెట్‌కు పోలిక లేదన్నారు.

# రేణుదేశాయ్ 'నీతోనే డాన్స్'



పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ మాజీ సతీమణి 'నీతోనే డాన్స్' అనే టెలివిజన్ డాన్స్ షో జడ్జిగా వ్యవహరించనున్నారు. ఈ షో సెప్టెంబర్ 30న ప్రారంభమవుతుంది. ఆల్రెడీ ప్రోమోతో ఈ షోకి విపరీతమైన హైప్ క్రియేట్ చేసేందుకు మాటీవీ ప్రయత్నిస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ హోస్ట్ చేస్తోన్న 'బిగ్‌బాస్' ఈ వారాంతంతో ముగియనుంది. ఆ తర్వాత ఇదే స్లాట్‌లో రేణుదేశాయ్ 'నీతోనే డాన్స్' షో ప్రసారం కానుంది. డాన్స్ షో అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. ఏదో జడ్జిమెంట్ ఇచ్చేసి ఊరుకుంటే కుదరదు. అవసరమైతే, ఆడిపాడాలి కూడా.! రేణుదేశాయ్ మంచి డాన్సర్. మోడలింగ్ రంగం నుంచి సినిమాల్లోకొచ్చిన రేణు దేశాయ్, తెలుగులో 'బద్రి', 'జానీ' సినిమాలో పవన్‌కళ్యాణ్ సరసన నటించిన విషయం విదితమే. ఇక, ఇన్నేళ్ళ తర్వాత రేణు దేశాయ్ మళ్ళీ తన నృత్యకౌశలాన్ని బయటపెట్టే స్కోప్ ఉన్న ప్రోగ్రాం మరి. మరో ఛానల్‌లో ప్రియమణి జడ్జిగా ఓ డాన్స్ షో నడుస్తోన్న విషయం విదితమే. అప్పుడప్పుడూ ఆ షోలో ప్రియమణి స్టెప్పులతో హోరెత్తించేస్తోంది. రేణుదేశాయ్‌తో పోల్చితే, ప్రియమణి తెలుగు చాలా సినిమాల్లో నటించేసినా, రేణుదేశాయ్ షో పట్ల ప్రత్యేకమైన క్రేజ్ నెలకొనడం గమనార్హం. ఇంతకీ, రేణు దేశాయ్ 'నీతోనే డాన్స్' ప్రోగ్రామ్ కోసం టీవీ ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు.

# బీఎస్ఎన్ఎల్ దసరా ఆఫర్..

**రీచార్జ్ వోచర్లపై 50 శాతం క్యాష్ బ్యాక్**

ప్రభుత్వ రంగ టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) దసరా పండుగను పురస్కరించుకుని దసరా విజయ్' పేరుతో రీచార్జ్ వోచర్లపై 50 శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్ ప్రకటించింది. దీంతోపాటు బీఎస్ఎన్ఎల్ మొబైల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా రీచార్జ్ చేసుకున్న వినియోగదారులు ఫుల్ టాక్ టైం పొందవచ్చని తెలిపింది. ఇది పరిమిత కాల ఆఫర్. ఈ రెండు ఆఫర్లను దేశవ్యాప్తంగా ఉన్న బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు అందరూ వినియోగించుకోవచ్చని, ఈనెల 25 నుంచి ఇది అందుబాటులో ఉంటుందని తెలిపింది.

ఆఫర్‌లో భాగంగా ఈ నెల 25 నుంచి వచ్చే నెల 25 మధ్య రీచార్జ్ ప్యాక్స్ కొనుగోలు చేసే వారికి 50 శాతం క్యాష్ బ్యాక్ లభిస్తుంది. రూ.42, రూ.44, రూ.65, రూ.69, రూ.88, రూ.122 రీచార్జ్ వోచర్లకు ఈ ఆఫర్ వర్తిస్తుందని కంపెనీ పేర్కొంది. ఫుల్ టాక్ టైం ఆఫర్ మాత్రం ఒక్క రూ.30 రీచార్జ్‌కే వర్తిస్తుందని, ఈ ఆఫర్ 25న ప్రారంభమై అక్టోబరు 2తో ముగుస్తుందని వివరించింది.పండుగ సమయాల్లో వినియోగదారులకు ఎక్కువ ప్రయోజనాలు కల్పిస్తుంటామని, ఈసారి 50 శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్‌తో వచ్చినట్టు బీఎస్ఎన్ఎల్ బోర్డు డైరెక్టర్ ఆర్‌కే మిట్టల్ తెలిపారు.

## జియో 60 లక్షల ఫోన్ల డెలివరీ!



**ముంబై :** రిలయన్స్ జియో 4జీ ఫీచర్ ఫోన్ బుక్ చేసుకున్న వారికి శుభవార్త. వాయిదా పడుతూ వస్తున్న ఫోన్ల డెలివరీ రేపటి (ఆదివారం) నుంచి ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. 15 రోజుల్లో 60 లక్షల ఫోన్లను డెలివరీ చేసేందుకు రిలయన్స్ ప్రణాళిక సిద్ధం చేసినట్టు సమాచారం. తొలుత గ్రామీణ ప్రాంతాల వారికి ఈ ఫోన్లు పంపిణీ చేసిన తర్వాత పట్టణాలకు సరఫరా చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. అయితే ఈ విషయమై జియో నుంచి ఇప్పటి వరకు ఎటువంటి అధికార ప్రకటన రాలేదు. జియో ఫీచర్ ఫోన్‌ను ఉచితంగా అందించనున్నట్టు రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ ప్రకటించారు. అయితే ఫోన్లు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు తొలుత రూ.1500 సెక్యూరిటీ డిపాజిట్‌గా వసూలు చేయనున్నట్టు తెలిపారు. మూడేళ్ల తర్వాత ఆ సొమ్మును తిరిగి ఇచ్చేస్తారు. గత నెల 24న ఈ ఫోన్ల బుకింగ్స్ ప్రారంభం కాగా 60 లక్షల మంది బుక్ చేసుకున్నారు. బుకింగ్ సందర్భంగా రూ.500 చెల్లించారు. డెలివరీ సమయంలో మిగతా రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది.

## మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు

**24 క్యారెట్ల బంగారం 10 గ్రా రూ. 30,770**
**22 క్యారెట్ల బంగారం 10 గ్రా రూ. 28,490**
**వెండి కిలో ధర రూ. 40,700**



బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర హైదరాబాదులో రూ.30,770, విజయవాడలో 30,270, ప్రొద్దుటూరులో రూ.30,150, ముంబైలో రూ.29,775గా ఉంది. ఇక 22 క్యారెట్ల ఆభరణాల బంగారం 10 గ్రాముల ధర హైదరాబాదులో రూ.28,490, విజయవాడలో 28,100, ప్రొద్దుటూరులో రూ.27,920, చెన్నైలో రూ.28,320, ముంబైలో రూ.29,625గా ఉంది. వెండి కిలో ధర హైదరాబాదులో రూ.40,700, విజయవాడలో 41,000, ప్రొద్దుటూరులో రూ.40,900, ముంబైలో రూ.39,450 వద్ద ముగిసింది.

Printed, Published and Owned by Pattan Hussain Khan, Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP 522237. Printed at Jagathi Publications Ltd., D.No : 5-625, Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Editor : Pattan Hussain Khan, Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18